నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

మంచి మాట లాడ మర్యాద మనకంట
పరుష భాషలాడ పరువుచేటు
మాటవలన మనిషి మాన్యుడై వెలుగొందు
మాట విలువ తెలిసి మసలుకొనుము

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 128 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 5-8-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




## సరిహద్దుల్లో చైనాఆక్రమణలు

- రాహుల్ వ్యాఖ్యలపై సుప్రీం ఘాటు హెచ్చరిక
- ఆధారాలు ఉన్నాయా అంటు పశ్నలు

న్యూఢిల్లీ

సుప్రీంకోర్టు సోమవారం రాహుల్ గాంధీకి గట్టి హెచ్చరికలు జారీ చేసింది. 2020 గల్వాన్ వ్యాలీలో జరిగిన ఘర్షణల గురించి ఆయన చేసిన కామెంట్స్ కారణంగా ఈ హెచ్చరిక చేసింది. రాహుల్, తన భారత్ జోడో యాత్రలో చైనా 2,000 చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించిందని, ప్రధాని నరేంద్ర మోదీ దాన్ని సరెండర్ చేశారని పేర్కొన్నారు. ఆ మాటలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మసీహ్‌ల బెంచ్ రాహుల్‌ని సీరియస్‌గా ప్రశ్నించింది. 2,000 చదరపు కిలోమీటర్ల భూమిని చైనా

-మిగతా 2 లో



## లైఫ్ సైన్సెస్ కేపిటల్‌గా హైదరాబాద్

### హైదరాబాద్ నుంచే 40 శాతం ఫార్మా ఉత్పత్తులు

- దేశ ఆర్థిక వ్యవస్థలో 10 శాతం తెలంగాణ నుంచే అందిస్తాం
- 2047 నాటికి 3 ట్రిలియన్ల ఎకానమీగా తెలంగాణ
- లిల్లీ ఫార్మా కంపెనీ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్

హైదరాబాద్

లైఫ్ సైన్సెస్ కేపిటల్‌గా హైదరాబాద్ కు గుర్తింపు లభించిందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లో ఫార్మా కంపెనీలకు జినోమ్ వ్యాలీ ప్రత్యేకమైనది అన్నారు. అమెరికాకు చెందిన ఫార్మా కంపెనీని, గచ్చిబౌలిలో ప్రముఖ లిల్లీ ఫార్మా కంపెనీని సిఎం ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మీడియాతో మాట్లాడుతూ..2047 నాటికి 3 ట్రిలియన్ల ఎకానమీగా తెలంగాణ ఉంటుందని తెలియజేశారు. దేశ ఆర్థిక వ్యవస్థలో 10 శాతం తెలంగాణ నుంచే అందిస్తామని, హైదరాబాద్ నుంచే 40 శాతం ఫార్మా ఉత్పత్తులు, అత్యధిక వ్యాక్సిన్లు

-మిగతా 2 లో



## మరోమారు భారత్‌పై ట్రంప్ అక్కసు

- మరిన్ని సుంకాలు విధిస్తానని హెచ్చరిక

వాషింగ్టన్,

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మరోసారి తన ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. ఇటీవల భారత్‌పై 25 శాతం ప్రతీకార సుంకం విధిస్తున్నట్లు- ప్రకటించిన ట్రంప్.. తాజాగా మరిన్ని సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. ఇప్పటికే భారత్‌పై విధించిన 25 శాతం ప్రతీకార సుంకాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనుగోలు చేస్తోందని, ఆ చమురును మళ్లీ విక్రయిస్తోందన్నారు. బహిరంగ మార్కెట్‌లో చమురు విక్రయించి భారత్ లాభం గడిస్తోందంటూ ఆక్షేపించారు. భారత్ పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేయడం వల్ల రష్యాకు భారీగా ఆర్థిక వనరులు చేకూరుతున్నాయని, అందుకే ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపడం లేదని విమర్శించారు. ఈ మేరకు ఆయన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. 'రష్యాతో

-మిగతా 2 లో

## ఐదేళ్లలో రూ.7.08లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేత..




- లోక్‌సభలో గణాంకాలను వెల్లడించిన మంత్రి..!

న్యూఢిల్లీ

2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఐదు సంవత్సరాల్లో దాదాపు రూ.7.08లక్షల కోట్ల పన్ను ఎగవేతను కేంద్ర జీఎస్టీ ఫీల్డ్ అధికారులు గుర్తించారు. ఇందులో దాదాపు రూ.1.79లక్షల కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసాలు ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఆర్థిక సహాయ మంత్రి పంక్ చౌదరి లోక్‌సభలో వివరాలను వెల్లడించారు. డేటా ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే రూ.2.23 లక్షలకోట్లకుపైగా జీఎస్టీ ఎగవేతను సీజీఎస్‌టీ ఫీల్డ్ అధికారులు గుర్తించారని, 2025 ఆర్థిక

-మిగతా 2 లో

## కాళేశ్వరం కమిషన్‌కు కేబినేట్ ఆమోదం

- అన్ని రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను తీసుకుంటాం
- లక్షకోట్ల ప్రాజెక్టు కుంగిపోవడం బాధాకరం
- అసెంబ్లీలో చర్చకు పెడతామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన



హైదరాబాద్,

కాళేశ్వరం కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ సమర్పించిన నివేదిక కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. దీనిని అసెంబ్లీలో పెడతామని అన్నారు. విచారణకు సంబంధించిన వివరాలను కమిషన్ విశ్లేషణాత్మకంగా నివేదికలో పొందుపరిచిందని చెప్పారు. క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను త్వరలో అసెంబ్లీలో ప్రవేశపెడతామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

-మిగతా 2 లో

## ప్రభుత్వ భూమిలో రియల్‌ఎస్టేట్ దందా

- రూ.10కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమి కబ్జా..
- రెవెన్యూ బోర్డు తొలగించి అక్రమంగా రూమ్లు నిర్మాణం..
- ఒక్కొక్క సెల్ఫ్ అసెస్మెంట్ ఇంటి నెంబర్కు రూ.లక్ష వసూళ్లు...?
- ఈదందాలో మాజీ ప్రజాప్రతినిధులు..?
- ' నీలగిరి ఎక్స్ ప్రెస్ ' ఎక్స్ క్లూజివ్

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు 04(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

జిల్లా కేంద్రంతో పాటు కొత్తగా ఏర్పాటైన కొత్తగూడెం కార్పోరేషన్లో నయా భూ దందాకు తెరలేపారు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాదు కాదు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కొంతమంది మాజీప్రజా ప్రతినిధులు పాల్పడ్డారని స్థానిక డివిజన్ ప్రజలు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేసినా వాటిని తొలగించి 2ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి చిన్న చిన్న రూమ్లు నిర్మాణాలు, ఆరూమ్లకు సెల్ఫ్ అసెస్మెంట్ ఇంటి

-మిగతా 2 లో





## రేవంత్ రెడ్డి, కేసీఆర్ దేశంలోనే నెంబర్ వన్ మోసగాళ్లు

- 20 నెలలు గడిచినా సీఎం రేవంత్ పింఛన్లు పెంచడం లేదు
- ప్రతిపక్ష నాయకునిగా కేసీఆర్ అడగడం లేదు
- పింఛన్లు పెంచకుంటే సీఎం రాజీనామా చేయాలి
- పెన్షన్ల పెంపు సాధన కోసం ఆగస్టు 13న హైదరాబాద్‌లో భారీ సభ
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, మందకృష్ణ మాదిగ

సిద్దిపేట,ఆగస్టు 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్)

సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్ దేశంలో నెంబర్ వన్ మోసగాళ్ళని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రేవంత్ రెడ్డి పెన్షన్లు పెంచకుండా వృద్ధులు, వికలాంగులను మోసం చేస్తుంటే.. ప్రతిపక్ష నాయకుని హొదాలో ఉండి కూడా కేసీఆర్ మౌనం వహిస్తూ ప్రజలకు ద్రోహం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ శోభ గార్డెన్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో

-మిగతా 2 లో

## అమీర్‌పేట్ మైత్రి వనమా..? సముద్రమా..?

- అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్
- తక్కువ వ్యవధిలో 50 మి.మీ వర్షపాతం
- ప్రమాదకరమైన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం
- కురిసిన వర్షానికి అమీర్ పేట్ మెట్రో స్టేషన్ పరిసర ప్రాంతంలో భారీగా నిలిచిన నీరు





హైదరాబాద్,ఆగస్టు 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్)

సోమవారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షానికి అమీర్ పేట్ మెట్రో స్టేషన్ పరిసర ప్రాంతంలో భారీగా నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు నడుంలోతు మేర నీళ్లు రోడ్డుపై నిలచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి.

-మిగతా 2 లో

# లైఫ్ సైన్సెస్ కేపిటల్‌గా హైదరాబాద్

(మొదటి తరువాయి)

తయారవుతున్నాయని అన్నారు. పరిశ్రమలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, అభివృద్ధి, ఆవిష్కరణలకు అనువైన వాతావరణం కల్పిస్తామని చెప్పారు. హైదరాబాద్‌ను భవిష్యత్ గ్లోబల్ హెల్త్ కేర్ హబ్ గా మారుస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగంలో ఈరోజు చరిత్రక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. 2000లకు పైగా లైఫ్ సెన్సెస్ కంపెనీలు హైదరాబాద్ లో ఉన్నాయని చెప్పారు. 200కి పైగా ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ నగరం నుంచి తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ లైఫ్ సైన్సెస్ ఆఫ్ ఇండియాగా మారుతోందన్నారు. 2047 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఎకానమిగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఎలీ లిల్లీ సంస్థ లీడర్ షిప్ ను, ఉద్యోగులను హైదరాబాద్ నగరానికి సాదరంగా ఆహ్వానం పలుకుతున్నాను. ఈ రోజు ప్రారంభమైన ఎలీ లిల్లీ నూతన కేంద్రం... ఆ సంస్థ గ్లోబల్ కార్యకలాపాలను మరింత వేగవంతం చేయడానికి ఉపయోగపడుతుంది. ఈ టెక్నాలజీ, ఇన్నొవేషన్ సెంటర్, ప్రపంచవ్యాప్తంగా రోగులకు పరిష్కారాల కోసం పరిశోధనలో కీలక పాత్ర పోషిస్తుంది. ఎలీ లిల్లీ సంస్థను హైదరాబాద్ నగరంలో ఏర్పాటు- చేయడమంటే ఈ నగరం ఘనతను మీరు ప్రపంచానికి చాటి చెప్పినట్లే. హైదరాబాద్ నగరంలో టాలెంట్ ఉంది, లీడర్‌షిప్ ఉంది, విజన్ ఉంది, మంచి పాలసీ ఉంది, మౌలిక సదుపాయాలు ఉన్నాయి. అందుకే ఎలీ లిల్లీ లాంటి గ్లోబల్ లీడర్‌కు ఇది అనుకూలమైన కేంద్రంగా మారింది. భారతదేశ లైఫ్ సైన్సెస్ రాజధానిగా హైదరాబాద్ ఇప్పటికే గుర్తింపు పొందిందని అన్నారు. భారత్‌లో ఫార్మాస్యూటికల్ ఉత్పత్తిలో సుమారు 40 శాతం తెలంగాణలోనే జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ప్రతి 3 టీ-కాలలో ఒకటి హైదరాబాద్‌లో అభివృద్ధి చేయడం లేదా తయారవుతుండటం మాకు గర్వకారణం. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, భారత దేశంలోని అతిపెద్ద లైఫ్ సైన్సెస్ పరిశోధన- అభివృద్ధి సముదాయంగా నిలిచింది. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఫార్మాస్యూటికల్, బయో-టె-క్నాలజీ సంస్థల కోసం హైదరాబాద్ అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రపంచ గమ్యస్థానంగా మారింది. ఈరోజు, ఎలీ లిల్లీ సంస్థ రాకతో, లైఫ్ సైన్సెస్ రంగంలో మేము మరో మెట్టు-కు చేరుకున్నాం. మధుమేహం, ఆంకాలజీ, ఇమ్యునాలజీ, న్యూరోసైన్స్ రంగాలలో ఎలీ లిల్లీ సంస్థ కృషి ఒక గేమ్‌ఛేంజర్ గా నిలిచిపోతుందని అన్నారు.

# కాళేశ్వరం కమిషన్‌కు కేబినేట్ ఆమోదం

(మొదటి తరువాయి)

దీనిపై అన్ని రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను చెప్పేందుకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు- తెలిపారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నాక భవిష్యత్తు కార్యాచరణతో పాటు- కమిషన్ సూచనలను అమలు చేసేందుకు ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఎవరిపైనా కక్ష సాధింపులు, వ్యక్తిగత ద్వేషం తమ ఉద్దేశం కాదనే అన్ని వివరాలనూ మీడియా ముందు ఉంచామని తెలిపారు. జలవనరుల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో దాదాపు రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం మేడిగడ్డ కుంగిపోయే ప్రమాదంలో పడింది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధనం దుర్వినియోగాన్ని దృష్టిలో పెట్టు-కొని న్యాయ విచారణ కోసం జస్టిస్ పీసీ ఘోష్‌ను నియమించాం. ఘోష్ కమిషన్ అందరితో మాట్లాడి ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఇందులో రాజకీయ ఆరోపణలు లేవు. ఇది ప్రభుత్వం ఇచ్చిన రిపోర్టు కాదు.. స్వతంత్ర న్యాయ విచారణ కమిషన్ ఇచ్చిన రిపోర్టు. కాళేశ్వరం నిర్మాణం, నిర్వహణ అవకతవకలు అన్నింటికీ బాధ్యుడు, జవాబుదారీ అప్పటి సీఎం కేసీఆరే అని నివేదికలో పేర్కొన్నారు. నిపుణుల కమిటీ- సూచనలకు కాకుండా సొంత నిర్ణయంతోనే మేడిగడ్డ వద్ద బ్యారేజీని నిర్మించారు. రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై విచారణ చేయిస్తామని మేనిఫెస్టోలో చెప్పామని, కమిషన్ చైర్మన్‌గా వ్యవహరించిన పీసీ ఘోష్ నిబద్ధత ఉన్న వ్యక్తి అని రేవంత్ చెప్పారు. కేసీఆర్, హరీష్ రావు సహా అనేక మందిని ఘోష్ విచారించారని, 16 నెలల విచారణ తరువాత 665 పేజీల నివేదిక ఇచ్చారని సీఎం తెలిపారు. ఊరు, పేరు, అంచనాలు మార్చి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని..అలా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ వారి హయాంలోనే కూలిపోయిందని సీఎం విమర్శించారు. వైఎస్ఆర్ సీఎంగా ఉన్నప్పుడు ప్రాణహిత చేవెళ్లను ప్రారంభించారని, రీడిజైనింగ్ పేరుతో కేసీఆర్ డిజైన్లను మార్చారని ఆరోపించారు. ప్రాజెక్ట్ నిర్మించిన మూడేళ్ల లోపే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని సీఎం గుర్తు చేశారు. అన్నారం, సుందిళ్లలో కూడా లోపాలున్నాయని రిపోర్ట్ ఇచ్చిందని సీఎం రేవంత్ చెప్పారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తామని, త్వరలోనే అసెంబ్లీకి నివేదికను రిపోర్ట్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అన్ని పార్టీల సూచనలు, అభిప్రాయాలు తీసుకుంటామని సీఎం తెలిపారు. అందరి ఆమోదం మేరకు ఏం చేయాలో నిర్ణయిస్తామని రేవంత్ చెప్పారు. ప్రజాప్రతినిధులకు కమిషన్ నివేదిక ఇస్తామని, అందరూ స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పొచ్చని సీఎం రేవంత్ వెల్లడించారు. ఎవరి పైనా వ్యక్తిగత ద్వేషంతో నిర్ణయాలు తీసుకోవడం లేదని, కమిషన్ రిపోర్ట్‌పై ఎవరు ఏ రకంగా మాట్లాడతారనేది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

# ప్రభుత్వ భూమిలో రియల్‌ఎస్టేట్ దందా

(మొదటి తరువాయి)

నెంబర్లు కేటాయించి రూ.10కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమిని కబ్జాకుమాజీప్రజాప్రతినిధులు పాల్పడ్డారనిస్థానిక డివిజన్ ప్రజలు, వివిధ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. గత మున్సి పార్టీ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కు ద్వారా ప్రజాప్రతి నిధు లను గెలిపిస్తే వారిలో కొంతమంది మాజీ ప్రజాప్రతినిధులు ప్రభు త్వ భూములను కబ్జా చేసి రియల్ స్టేట్గా వ్యాపారం చేసి కోట్లకు కోట్లు పడగలెత్తారని తమ సమస్యలను గాలికి వదిలేసి మున్సిపాల్టీ పరిధిలోని ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపిస్తే అక్కడ కబ్జా చేశారని ప్రజలు, ఆయా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కొత్తగూడెం నగరపాలక సంస్థ 29 డివిజన్ పరిధిలోని ప్రగతి నగర్ ఏరియాలో ఉన్న హిందూ స్మశానవాటికకు ఎదురుగా సర్వే నెంబర్ 142 పరిధిలోని సుమారు 2ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. కొంతమంది మాజీప్రజాప్రతినిధులు ఈభూమిని కబ్జా చేసి చిన్నచిన్న రూమ్లుగా నిర్మించి, ఆరూమ్లను విక్రయించి కోట్లకు పడగెత్తారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అందులో చిన్నచిన్న రూమ్లు నిర్మా ణం చేసి సెల్ఫ్ అసెస్మెంట్ ఇంటినెంబర్లుకు అధికారులు ఒక్కొక్క ఇంటి నెంబరు లక్ష వరకు వసూలుచేసినట్లు తెలుస్తోంది. అసలు సెల్ఫ్ అసెస్మెంట్ ఇంటినెంబర్ల కేటాయింపు నిబంధనలు పాటించ కుండా ధనార్జనే ధ్యేయంగా ముడుపులకు ఆశపడి ఎలాంటి విచా రణ జరపకుండా, కొంతమంది మాజీప్రజా ప్రతినిధులు, అధికా రులు, ఆక్రమణ దారులు కుమ్మక్కై సెల్ఫ్ అసెస్మెంట్ నెంబర్లు కేటాయించినట్లు తెలుస్తోంది. ఇంటినెంబర్లు కేటాయించేతప్పుడు ఆ శాఖాధికారులు ఇదిప్రభుత్వ భూమా లేదా ప్రయివేట్ భూమా అని ఆలోచించకుండా మామూళ్లకు ఆశపడి సెల్ఫ్ అసెస్మెంట్ నెంబర్లు కేటాయించినట్లు, అధికారుల అండదండలతోనే నెంబర్లు కేటాయింపులు జరిగినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. కొత్తగూడెం కార్పోరేషన్ ప్రగతినగర్ ఏరియా పరిధిలో ఉన్న హిందూ స్మశాన వాటికకు ఎదురుగా ఉన్న సర్వేనెంబర్ 142లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. రెవెన్యూ అధికారులు ప్రభు త్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేయడం జరిగింది. కాని కొంత మంది మాజీ ప్రజాప్రతినిధులు, ఆక్రమణదారులు ఆభూమిని కబ్జా చేసి చిన్నచిన్న రూమ్లుగా నిర్మాణం చేసి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసి రూ.10కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జాచేసి అమ్మకాలు చేసినట్లు తెలుస్తోంది. ఈప్రభుత్వ భూమిలో అక్రమంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారిని కట్టడి చేసి, 29, 31, 51, 52, 53 డివిజన్ ప్రజలకు ఉపయోగపడే పార్కుగాని, కమ్యూనిటీ హాల్ ని ఏర్పాటు చేయాలని ఆయా డివిజన్ ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతా ధికారు లతోపాటు మండల రెవెన్యూ అధికారులు కార్పోరేషన్ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలు తొలగించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని కోరుతున్నారు. అయితే కొంతమంది మాజీ ప్రజాప్రతినిధులు, ఆక్రమణదారులు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి కోట్లకు పడగలెత్తిన వారిని కాపాడతారా లేదా స్థానిక ప్రజలకు ఉపయోగపడే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

# రేవంత్ రెడ్డి, కేసిఆర్ దేశంలోనే నెంబర్ వన్ మోసగాళ్లు

(మొదటి తరువాయి)

నిర్వహించిన సభకు ఆయన హాజరై ప్రసంగించారు. వృద్ధులు, వికలాంగులకు పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా సీఎం రేవంత్ రెడ్డి పెన్షన్లు పెంచడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పటినుంచే పెన్షన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడైనా పేదల గురించి కేసీఆర్ అడగడం లేదని, ఇప్పటికైనా మౌనం వీడాలని అన్నారు. ప్రతిపక్ష నాయకుని పాత్రలో కేసీఆర్ పూర్తిగా విఫలమ య్యారన్నారు. 2007 నుంచి వికలాంగుల హక్కుల పోరాట సమితి ప్రారంభించి పేదల కోసం పోరాడానని, ఆ ఫలితంగానే ప్రస్తుతం ప్రభుత్వాలు పెన్షన్లు ఇస్తున్నాయన్నారు. ప్రజలను మోసం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, ప్రతిపక్షనేత కేసీఆర్‌కు వచ్చే స్థానిక



ఎన్నికల్లో ఓటేయొద్దని పిలుపునిచ్చారు. పింఛన్ పెంచుతావా లేక రాజీనామా చేస్తావా తేల్చుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. పెన్షన్ల పెంపు సాధన కోసం ఆగస్టు 13న హైదరాబాద్‌లో భారీ సభను నిర్వహిస్తున్నామని, దాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కామల్ల భూమయ్య, ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద కుమార్, జిల్లా ఇన్‌చార్జి మల్లిగారి యాదగిరి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మొక్కపల్లి రాజు మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు బుడిగే మహేష్ మాదిగ, జిల్లా కార్యదర్శి ఉబ్బని ఆంజనేయులు, టీజీడీజే ఏసీ బాబు, దుర్గయ్య, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సరిహద్దుల్లో చైనాఆక్రమణలు

(మొదటి తరువాయి)

తీసుకుందని మీరు ఎలా తెలుసుకున్నారని ప్రశ్నించింది? మీరు నిజమైన భారతీయులైతే అలా మాట్లాడరు కాదా అని జస్టిస్ దత్తా అడిగారు. మీరు అక్కడ ఉన్నారని, మీ దగ్గర ఏమైనా నమ్మదగిన ఆధారాలు ఉన్నాయా అని అడిగింది. రాహుల్ తరపున సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వీ వాదించారు. రాహుల్ అలాంటి మాటలు చెప్పకపోతే, ఆయన ప్రతిపక్ష నాయకుడిగా ఎలా ఉంటారని సింఘ్వీ అన్నారు. దీనికి జస్టిస్ దత్తా మరి ఇలాంటివి పార్లమెంట్‌లో ఎందుకు మాట్లాడటం లేదన్నారు. అయినా, ఈ కేసును కొట్టివేయాలన్న రాహుల్ విజ్ఞప్తిపై కోర్టు నోటీసు జారీ చేసింది. ఈ కేసు కొనసాగనుందని చెప్పింది. సింఘ్వీ, ఈ కేసులో కొన్ని తప్పులు జరిగాయని చెప్పారు. పోలీసులు రాహుల్‌కి ముందస్తు విచారణ అవకాశం ఇవ్వకుండానే కేసు నమోదు చేశారని వాదించారు. గతంలో, మే నెలలో అలహాబాద్ హైకోర్టు కూడా రాహుల్ పిటిషన్‌ను తిరస్కరించింది. లక్నోలో ప్రత్యేక కోర్టు రాహుల్‌కు ఫిబ్రవరిలో సమన్స్ జారీ చేసి, ఆయనపై విచారణకు ఆదేశించింది. హైకోర్టు జడ్జి సుభాష్.. స్వేచ్ఛగా మాట్లాడే హక్కు అంటే సైన్యాన్ని అవమానించేలా మాట్లాడే హక్కు కాదని పేర్కొన్నారు. ఈ కేసు మొదట 2022 డిసెంబర్‌లో ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో బయటకొచ్చింది. రాహుల్ గాంధీ సైన్యం గురించి అవమానకరమైన వ్యాఖ్యలు చేశారని ఆయన ఆరోపించారు. రాహుల్ మాత్రం ఈ ఆరోపణలు రాజకీయంగా ప్రేరేపితమని చెప్పారు. రాహుల్ ఈ విషయాన్ని పలుమార్లు పునరావృతం చేశారు. 2023 జనవరిలో జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో కూడా, చైనా మన భూమిని ఆక్రమించిందన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని ఖండించింది.

# మరోమారు భార్గత్‌పై ట్రంప్ అక్కసు

(మొదటి తరువాయి)

యుద్ధం వల్ల ఉక్రెయిన్‌లో ఎంత మంది ప్రాణాలు కోల్పోతున్నారో వాళ్లకు అవసరం లేదు. అందుకే భారత్‌పై సుంకాలను మరింత పెంచబోతున్నామని ట్రంప్ పేర్కొన్నారు.

# ఐదేళ్లలో రూ.7.08లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేత..

(మొదటి తరువాయి)




సంవత్సరంలో 30,056 జీఎస్టీ ఎగవేత కేసులను గుర్తించినట్లు ప్రభుత్వం లోక్‌సభకు తెలిపింది. ఇందులో సగానికిపైగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు సంబంధించినవే ఉన్నాయని పేర్కొంది.ఈ కేసుల్లో రూ.58,772 కోట్ల పన్ను ఎగవేత జరిగిందని.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.30 లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేత, 2023 ఆర్థిక సంవత్సరంలో దాదాపుగా రూ.1.32లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేతను గుర్తించారని, 2022 ఆర్థిక సంవత్సరంలో రూ.73,238కోట్లు, 2021 ఆర్థిక సంవత్సరంలో రూ.49,384 కోట్ల జీఎస్టీ ఎగవేత జరిగిందని అధికారులు గుర్తించారు. గడిచిన ఐదేళ్లలో సీజీఎస్టీ ఫీల్డ్ అధికారులు రూ.91,370 కేసుల్లో దాదాపు రూ.7.08 లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేతను అధికారులు గుర్తించారన్నారు. ఈక ఆలంలో స్వచ్ఛంద డిపాజిట్ల ద్వారా వసూలు చేసిన పన్నులు రూ.1.29 లక్షల కోట్లకుపైగా ఉన్నాయి. 2021 ఆర్థిక సంవత్సరం నుంచి 2025 ఆర్థిక సంవత్సరం మధ్య 44,938 కేసుల్లో దాదాపు రూ.1.79 లక్షల కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పన్ను ఎగవేత వేసినట్లు కేంద్రం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం, జీఎస్టీఎన్ పన్ను ఎగువేతను నివారించేందుకు వివిధ చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రమంత్రి చౌదరి లోక్‌సభలో తెలిపారు. ఈ-ఇన్వాయిస్ ద్వారా డిజిటలైజేషన్, జీఎస్టీ రివ్యూ తదితర చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం తీసుకునే చర్యలన్నీ పన్ను ఎగవేతదారులను పట్టుకోవడంలో సహాయపడుతాయని చౌదరి లోక్‌సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. సవరించిన అంచనాలతో పోలిస్తే వాస్తవ నికర కేంద్ర జీఎస్టీ వసూళ్లపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నికర సీజీఎస్టీ వసూళ్లు సవరించిన అంచనాలలో 96.7 శాతమని చౌదరి అన్నారు. నికర సీజీఎస్టీలో సీజీఎస్టీ, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ, పరిహార సెస్ ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. 2025 ఆర్థిక సంవత్సరంలో వాస్తవ వసూళ్లు రూ.10.26 లక్షల కోట్లకుపైగా ఉండగా, సవరించిన అంచనాలు దాదాపు రూ.10.62 లక్షల కోట్లు. 2024 ఆర్థిక సంవత్సరంలో నికర సీజీఎస్టీ వసూళ్లు రూ.9.57 లక్షల కోట్లకుపైగా ఉన్నాయి. సవరించిన అంచనాలు రూ.9.56 లక్షల కోట్లలో 100.1శాతం.

# అమీర్పేట్ మైత్రి వనమా..? సముద్రమా..?

(మొదటి తరువాయి)



అయితే.. దీనికి సంబంధించిన వీడియోలో నెట్టింట వైరల్ గా మారాయి. ఇదిలా ఉంటే.. పాతబస్తీలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. బండ్లగూడ,చాంద్రాయణగుట్ట, ఫలక్నుమా, దబీరురా, బహదూర్పురా, కాలాపతేర్, రామస్వామిగంజ్, ఛత్రినాక, మల్లేపల్లి వంటి పలు ప్రాంతాల్లో మోకాళ్ల లోతు నీరు నిలిచింది. భారీ వర్షాలకు హైదరాబాద్ రోడ్లు జలమయమయ్యాయి. తెలంగాణ వెదర్మ్యాన్ తీవ్ర ఉరుములు మెరుపులతో కూడిన హెచ్చరిక జారీ చేశారు. వరదలు పోయిన రోడ్ల గుండా ప్రయాణించడానికి వాహనదారులు ఇబ్బంది పడుతున్నట్లు కనిపించింది. పాదచారులు రోడ్డు పక్కనే ఉండి, నీరు తగ్గే వరకు వేచి చూస్తున్నారు. ఓల్డ్ సిటీలోని అన్ని ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ జామ్లు కనిపించాయి.

## 2025 ఆగస్టు 5, మంగళవారం




మాసం- పక్షం
శ్రావణ మాసం (అమాంత)
శుక్లపక్షం
తిథి
ఏకాదశి -రాత్రి 10:07 వరకు
ద్వాదశి - తరువాత ప్రారంభం
నక్షత్రం
పూర్వాషాఢ - రాత్రి 11:04 వరకు
ఉత్తరాషాఢ - తరువాత ప్రారంభం
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: 4:27 - 5:13
అభిజిత్ ముహూర్తం: 12:00 - 12:52
అమృతకాలం: సా. 3:36 - 5:19
అశుభ సమయాలు
రాహుకాలం: 3:40 - 5:16
యమగండం: 9:15 - 10:52
దుర్ముహూర్తం: 9:00 - 9:52, 11:38 - 12:29
వర్జ్యం: సా. 3:36 - 5:19

# స్థానికులకే డబుల్ బెడ్ రూమ్స్-కేఎల్ఆర్ హామీ

### ఇందిరమ్మ ఇళ్ల పూర్తి పనులకు సహకారం, పేదలకు న్యాయం చేయాలి



**మహేశ్వరం, ఆగస్టు 04 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడలో, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను స్థానికులకే కేటాయించాలని కోరుతూ లెనిన్ నగర్ వాసులు, మహిళలు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ, గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసి, స్థానికులకు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ పథకం కింద నిర్మాణం మధ్యలో ఆగిపోయిన ఇళ్లకు, కూల్చివేసిన ఇళ్లకు సైతం కొత్త జాబితాలో అవకాశం కల్పించి, పేదలకు ఆర్థిక సహాయం అందేలా చూడాలని తుమ్మలూర్ కాంగ్రెస్ నేతలు కోరారు. అలాగే, నిర్మాణ సమయంలో స్థల పరిమితి కారణంగా చిన్న చిన్న మార్పులు చేసుకున్న లబ్ధిదారులకు కూడా రూ.5 లక్షల ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని మెహబత్ నగర్ ప్రాంతానికి చెందిన లబ్ధిదారులు విజ్ఞప్తి చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పూర్తి అయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను స్థానికులకు కేటాయించకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించారని కేఎల్ఆర్ విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో కూడా ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో, పేదలకు న్యాయం చేయాలన్న సంకల్పంతో తక్షణ చర్యలు చేపట్టాలని కేఎల్ఆర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. పేదల ఆకాంక్షలకు న్యాయం చేయాలంటే, ప్రభుత్వం నిర్మాణ పనులను వేగవంతం చేసి, అర్హులైన స్థానికులకు ఇండ్లు కేటాయించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.

## ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే

### ఇందిరమ్మ కాలనీ 6వ వార్డులో భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు



**మిర్యాలగూడ, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మిర్యాలగూడ ఇందిరమ్మ కాలనీ 6వ వార్డులో శ్రీ ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నూకుల వేణుగోపాల్ రెడ్డి పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అమ్మవారి దీవెనలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిలుకూరి బాలు, ముదిరెడ్డి నర్సిరెడ్డి, దేశ రెడ్డి శేఖర్ రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు. స్థానికులు పెద్ద ఎత్తున హాజరై భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించారు.

## నవగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్



**బాచుపల్లి, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి శ్రీ హెూమ్స్ కాలనీలో శ్రీ అభయ ఆంజనేయ సహిత నవగ్రహ ప్రతిష్టాపన మహెూత్సవంను ఆగస్టు 4న ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు రవి కిరణ్, పెడిరెడ్డి సుజాత ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, ఆలయాల అభివృద్ధిలో ఎల్లవేళలా ముందుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రదీప్ తాళ్ళూరి, చిలుకూరి బాలు, ముదిరెడ్డి నర్సిరెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్లగొండ,ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్లో నిర్మించిన తన క్యాంపు కార్యాలయాన్ని మంత్రి సోమవారం ప్రారంభించారు తమకు అన్ని వసతులు కల్పించిన సీఎం రేవంత్ రెడ్డి మళ్లీ సీఎం అవ్వాలని ప్రత్యేక పూజలు నిర్వహించి తనకు ఫోన్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు తన క్యాంపు కార్యాలయంలో ఉంటూ ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జై వీర్ రెడ్డి, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బీసీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం అవసరం

### -ప్రభుత్వానికి ఆకుల శ్రీవాణి డిమాండ్



**సరూర్ నగర్, ఆగస్టు 04 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని సరూర్ నగర్ ప్రాంతంలో బీసీ సమాజానికి వ్యాపార అవకాశాలు కల్పించే దిశగా బీసీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి స్పష్టం చేశారు. బీసీ యువత ఆర్థికంగా నిలదొక్కుకునే మార్గాలు కల్పించాలంటే, ప్రభుత్వమే ముందడుగు వేయాలని ఆమె పేర్కొన్నారు. హెచ్ఎండిఏ పరిధిలోని పాత కోర్టు స్థలాన్ని ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకొని, అక్కడ బీసీ కమ్యూనిటీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా బీసీ కుటుంబాలకు ఉద్యోగ, వ్యాపార అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, వారి జీవన ప్రమాణాలు మెరుగవుతాయని ఆమె అభిప్రాయపడ్డారు. బీసీల అభివృద్ధిపై నిజమైన ప్రేమ, బాధ్యత ఉన్నదంటే, ఈ కాంప్లెక్స్ నిర్మాణం ప్రభుత్వానికి ప్రాధాన్యంగా ఉండాలని ఆకుల శ్రీవాణి పేర్కొన్నారు. ఇది కేవలం నిర్మాణం కాదు, బీసీ సమాజానికి ఆర్థిక స్వావలంబనకు దారితీసే మార్గం అని ఆమె స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ అంశంపై తక్షణమే స్పందించి, అవసరమైన చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

## తెలంగాణ విద్యా రంగంలో నూతన శకం

### 200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు భూమి పూజ చేసిన: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్లగొండ,ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నల్గొండలో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో,22 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కు ఈరోజు భూమిపూజ నిర్వహించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ -తెలంగాణ విద్యా రంగంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా విప్లవాత్మక మార్పు ప్రారంభమైందని పేద ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలని,తెలంగాణ విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడగలగాలని లక్ష్యంగా అంతర్జాతీయ ప్రమాణాలతో,డిజిటల్ లైబ్రరీలు,స్మార్ట్ బోర్డులు,కంప్యూటర్ ల్యాబ్‌లు వంటి ఆధునిక హంగులతో,హైటెక్ డిజిటల్ విద్యాబోధనతో నిర్మితమవుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే ఇలాంటి చారిత్రాత్మక కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందంగా ఉందని ఈ పాఠశాలను మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు .ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి ,వేముల వీరేశం ,కుందూరు జైవీర్ రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## అన్ని కాలనీలకు మంచినీరు అందించాలి

### -ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### షాద్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో మిషన్ భగీరథపై సమీక్ష



**షాద్ నగర్, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి సమక్షంలో జరిగిన సమీక్ష సమావేశంలో మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు. ఇటీవల పలు కాలనీల్లో పర్యటించిన సందర్భంగా, మహిళలు, స్థానికులు నీటి సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. చిన్న సమస్యలే అయినా వెంటనే పరిష్కరించాలని, అధికారులు అలసత్వం చూపకూడదని ఆయన హెచ్చరించారు. ఇటీవల కేంద్రం రూ.28 కోట్ల నిధులు విడుదల చేసినట్లు సమాచారం ఉంది, వీటిని మిషన్ భగీరథ పనుల పూర్తి కోసం వినియోగించనున్నారు.

## గ్రామ అభివృద్దే లక్షంగా ఏఐవైఎఫ్




**దేవరకొండ, ఆగస్టు 04(నీలగిరి ఎక్స్ ప్రెస్):** డిండి మండలంలోని తవక్లాపూర్ గ్రామంలో అఖిలభారత యువజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్ సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ,గ్రామ పరిపాలన ప్రభుత్వ అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు విధులకు హాజరుకాకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు నిత్యం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని లేనియెడల పై అధికారుల దృష్టికి తీసుకుపోతామని ఆయన హెచ్చరించారు విధులకు హాజరు కాని అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలనీ ఆయన అన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా నల్లబోతుల మహేష్,కార్యదర్శిగా గోద మహేష్,కోశాధికారి యండీ షమీద్, ఉపాధ్యక్షులు గంట శేఖర్,సహాయ కార్యదర్శిగా,యండి ఆదిల్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీజిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు,సిపిఐ తవక్లాపూర్ గ్రామశాఖ కార్యదర్శి వంకేశ్వరం చక్రి, ఏ ఐ వై ఎఫ్ మండల అధ్యక్షులు ఎలిమినేటి నరేష్,మిద్దె సందీప్, ఈసా, చెనమోని గణేష్,నూనె మల్లేష్,నారిమల్ల కిరణ్,యాతం సైదులు,మీనుగా నవీన్,కడారి జశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ ధర్నాకు భారీగా తరలిరావాలి

### ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ యాట గీత నర్సింహా పిలుపు



**ఆమనగల్లు, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** బీసీ రిజర్వేషన్ల అమలుకు మద్దతుగా ఢిల్లీలో రేపు నిర్వహించనున్న మహా ధర్నాలో పాల్గొనేందుకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీసీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ యాట గీత నర్సింహా పిలుపునిచ్చారు. కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ మండలాల నుంచి బీసీ సంఘాలు, నాయకులు, ప్రజలు ఐక్యంగా ముందుకు వచ్చి ధర్నాను విజయవంతం చేయాలని ఆమె కోరారు. బీసీల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ తమ పాత్రను నెరవేర్చాలని ఆమె సూచించారు.

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం

## షాద్‌నగర్‌లో "డ్రగ్స్ ఫ్రీ" ఉద్యమానికి విశేష స్పందన



**షాద్‌నగర్, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** షాద్‌నగర్‌లో యువతలో మత్తు వ్యసనంపై అవగాహన పెంచేందుకు యునైటెడ్ యూత్ కరేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "డ్రగ్స్ ఫ్రీ షాద్‌నగర్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విజయ కార్డియాక్ ఆసుపత్రి అధినేత డాక్టర్ చందూలాల్ రాథోడ్ సహకారంతో ఈడెన్ ప్లాజాలో జరిగిన ఈ కార్యక్రమానికి 1500 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని, యువతకు మత్తు మాఫియాపై గట్టి హెచ్చరికలు చేశారు. "రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు సైతం డ్రగ్స్ బానిసలయ్యారు. గత పాలకుల నిర్లక్ష్యంతో డ్రగ్ మాఫియా పెచ్చుమీద నీళ్లు పోయినట్టు విస్తరించింది. కానీ సీఎం రేవంత్ రెడ్డి గారు అధికారంలోకి వచ్చిన తర్వాత మత్తు మాఫియాపై ఉక్కుపాదం మోపారు" అని ఆయన వ్యాఖ్యానించారు. విద్యార్థులు తమ కుటుంబ ఆశయాలను నిలబెట్టేందుకు మత్తుకు దూరంగా ఉండాలని, యాంటీ డ్రగ్ వారియర్లుగా మారాలని పిలుపునిచ్చారు. "సమాజాన్ని రక్షించేందుకు యువత ముందుండాలి" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యాంటి నార్కోటిక్ బ్యూరో అధికారి పి. సీతారాం, డీఎస్పీ సైదులు, ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. "ప్రతి యువకుడు డ్రగ్స్‌ను ఎదుర్కొనే బాధ్యత తీసుకోవాలి" అంటూ వారు సూచించారు. "డ్రగ్ ఫ్రీ సమాజం–నా బాధ్యత" అంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఫౌండేషన్ నిర్వాహకులను ఎమ్మెల్యే, పోలీసు అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, న్యాయవాది సబియా సుల్తానా, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోలాన్ గూడా కత్వా వాగు కబ్జా కలకలం



కత్వవాగులోకి పూర్తిగా.. మట్టి



పొలంలో నుండి మట్టి తవ్వకాలు

**కందుకూరు, ఆగస్టు 04 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండల కేంద్రంలో ఉన్న కోలాన్ గూడా గ్రామంలో రాజాకారుల కాలం నాటి కత్వా వాగు ఆక్రమణకు గురవుతున్నది. వాగు ఆనవాళ్లు పూర్తిగా మాయమయ్యేలా మట్టి పోయడం, రాళ్లు వేయడం, తవ్వకాలు జరిపి నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం వంటి చర్యలు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. వాగు నుండి పొలాలకు వెళ్లే నీటిని అడ్డుకునేలా తవ్వకాలు జరిపినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వాగు సర్వే నెంబర్ 250 పరిధిలో ఉండగా, రెవెన్యూ రికార్డుల ప్రకారం ఇది ప్రభుత్వానికి చెందినదే. అయినప్పటికీ, వాగు ఆక్రమణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవ పరిస్థితిని పరిశీలించేందుకు కందుకూరు ఎమ్మార్వో శ్రీ కె. గోపాల్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మీడియా బృందం కూడా అక్కడికి వచ్చి పరిస్థితిని చిత్రీకరణ చేసింది. వాగు ఆక్రమణ వెనుక రాజకీయ నాయకుల హస్తం ఉందనే అనుమానాలు ప్రజల్లో గట్టిగా వినిపిస్తున్నాయి. అధికార యంత్రాంగం రాజకీయ ఒత్తిడికి లోనవకుండా, న్యాయబద్ధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వాగు ఆనవాళ్లను పునరుద్ధరించి, నీటి ప్రవాహాన్ని తిరిగి సాధారణ స్థితికి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ ఘటన వ్యవసాయానికి ముప్పుగా మారే అవకాశమున్న నేపథ్యంలో, ప్రభుత్వం తక్షణమే స్పందించి, వాగు ఆక్రమణను అరికట్టే చర్యలు చేపట్టాలి. వాగు ఆక్రమణకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు గళమెత్తుతున్నారు. వాస్తవాలను వెలికితీసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



పూర్తిగా రాళ్లతో కత్వ వాగు కబ్జా

# డా. లయన్ కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి కి "విద్యా విభవ సరస్వతి" అవార్డు బహుకరణ...





**హైదరాబాద్,ఆగస్ట్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** లలితకళ సమాఖ్య, హైదరాబాద్ సర్వత్ర గుర్తింపు పొందిన ప్రముఖులకు "సువర్ణ కంకణ ధారి" అవార్డు ప్రదానం చేశారు. విద్యా విభవ సరస్వతి అవార్డుతో డా.లయన్ కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి కి సత్కారం జరిగింది. హైదరాబాద్‌లోని లలితకళ సమాఖ్య ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు సువర్ణ కంకణ ధారి పురస్కారాలను ఘనంగా ప్రదానం చేశారు. విద్య, జ్యోతిష్యం, సామాజిక సేవ, సినిమా, కరాటే, వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక విభాగాలలో సేవలందించిన వారిని ఈ కార్యక్రమంలో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త, రచయిత, మోటివేటర్ మరియు పర్యావరణ పరిరక్షకుడు డా. లయన్ కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి కి "విద్యా విభవ సరస్వతి" అవార్డును ఘనంగా అందజేశారు. వారి ప్రసంగంలో, సమాజాన్ని, మన భవిష్యత్ తరం పిల్లలను మేలు చేసే బాధ్యత ప్రతి ఒక్కరిది. ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు శిక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. విద్యను, పర్యావరణాన్ని రక్షించడమే నిజమైన అభివృద్ధి, అని చెప్పారు. అలాగే ఈ కార్యక్రమానికి వచ్చిన తల్లిదండ్రులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సాంస్కృతిక మహోత్సవంలో విద్యార్థులు అందించిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి హాజరైన సభాధ్యక్షులుగా డా.లయన్ కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి వ్యవహరించగా, ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, సినీ నటుడు శివాజీ రాజా, జనార్ధన్ రావు సినీ హాస్య బ్రహ్మ, లక్ష్మణ్ గుప్తా, కట్ట వీరభద్రం,జి.బి.ఎన్ మురళీకృష్ణ, లలితకళ సమాఖ్య అధ్యక్షుడు వెంకటేశ్వరరావు సుజాత మనోరంజన, ఎస్.మస్తాన్, భాస్కర మంజుల, వెంకటేశ్వర్ శర్మ తదితరులు పాల్గొన్నారు. సంస్కృతి సేవ, విద్య సమ్మేళనంగా ఈ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా ముగిసింది.



# మేడ్చల్ కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

– ప్రజా సమస్యలపై వినతి పత్రం



**మేడ్చల్,ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరిను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో, నియోజకవర్గంలోని పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎండోస్మెంట్ ల్యాండ్స్, కమ్యూనిటీ హాల్స్, బాచుపల్లి కౌసల్య కాలనీలో ల్యాండ్ కబ్జా, టీఎస్ఐఐసీ భూముల సమస్య, డబుల్ బెడ్ రూమ్స్‌లో అంగన్‌వాడీ కేంద్రాలు, బస్తీ దవాఖానలు, చౌకదారుల దుకాణాలు, నీటి సరఫరా వంటి అంశాలపై చర్చ జరిగింది. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వ యంత్రాంగం స్పందించాలని, ప్రజాప్రతినిధులుగా తమ బాధ్యతను నిర్వర్తిస్తున్నామని నేతలు పేర్కొన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

–కడ్తాల్‌లో వైభవంగా మహోత్సవం

మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ప్రత్యేక పూజలు



**కడ్తాల్, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కడ్తాల్ మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని, ఆలయ కమిటీ సభ్యుల నుంచి ఘన సన్మానం పొందారు. ఈ సందర్భంగా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ, "ప్రతి గ్రామంలో దేవతల విగ్రహ ప్రతిష్ఠ జరగాలి. ప్రజలు దైవ మార్గాన్ని అలవర్చుకోవాలి. శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీర్వాదంతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో ఆనందంగా ఉండాలి" అని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు లక్ష్మీ నరసింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, రైతు సమన్వయ మాజీ అధ్యక్షులు జోగు వీరయ్య, మాజీ ఎంపిటిసి లచ్చి రామ్ నాయక్, శ్రీను గుప్తా, బీఆర్ఎస్ యువ నాయకులు మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ జార్ఖండ్ ముఖ్యమంత్రి, ఆదివాసీ నేత శిబు సోరెన్ మృతి పట్ల మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ సంతాపం....



**హైదరాబాద్, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** జార్ఖండ్ మాజీ సీఎం శిభు సోరెన్ మృతి పట్ల మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ సంతాపం తెలియజేశారు. భారత దేశంలో ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటు కోసం పోరాడిన అరుదైన నాయకుల్లో శిభు సోరెన్ ఒకరనీ, తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి దేశవ్యాప్తంగా మద్దతు ఇచ్చిన ఆయన, టీఆర్ఎస్ ఏర్పాటు అయిన తొలి రోజుల్లోనే తన మద్దతును ప్రకటించి బహిరంగ సభలో పాల్గొనడం మరవలేని అంశమని, తెలంగాణ ఉద్యమ నేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కు శిభు సోరెన్ పలు సందర్భాల్లో ఉద్యమ స్ఫూర్తిని నూరిపోశారనీ అన్నారు. ఆయన మృతి దేశానికి, ఆదివాసీ సమాజానికి, ప్రత్యేక రాష్ట్రాల కోసం పోరాడే ఉద్యమాలకు తీరనిలోటు. ఆయన కుటుంబానికి, శ్రద్ధాంజలి ఘటిస్తున్న అభిమానులకు బోయినపల్లి ప్రగాఢ సానుభూతినీ తెలియజేశారు.

# పర్యావరణ పరిరక్షణ సమితి యొక్క లక్ష్యాలు మరియు మిషన్

- లక్ష్యం

సుస్థిరమైన, ఆరోగ్యకరమైన జీవనవాతావరణం కోసంపర్యావరణాన్ని రక్షిస్తూ, ప్రజల ఆరోగ్యం, ఆయుష్షు పెంపుకు కృషి చేయడం.

మిషన్

- శాస్త్రీయ పద్ధతుల్లో పర్యావరణ పరిరక్షణ
- గాలి, నీరు, నేలపై కాలుష్య నివారణ
- విద్య, సాంకేతికతతో ప్రజల్లో అవగాహన
- యువతకు పది వేల ఉద్యోగ అవకాశాలు
- అభివృద్ధి -పర్యావరణాన్ని సమతుల్యంగా ముందుకు నడిపించడం
- మాదకద్రవ్యాల రహిత భారత దేశ ఆవిష్కరణ
- భారతీయ సాంప్రదాయాల విస్తృత ప్రచారం

పర్యావరణ పరిరక్షణ సమితి
చెట్టు = అమ్మ
Reg No. 643/2025
Nurture Nature, Promote Wellness



# దేశ సమగ్రత, ఆర్థిక రంగాన్ని కాపాడాలి

**నల్లగొండ, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేశాన్ని మత ప్రాతిపదికన విభజించే కుట్ర జరుగుతోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నల్లగొండలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల ఓట్లను తొలగించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. బీహార్‌లో 65 లక్షల ఓట్లను తొలగించారని, త్వరలో దేశవ్యాప్తంగా ఇదే ప్రక్రియ కొనసాగనుందని తెలిపారు. పౌరసత్వ ధ్రువీకరణకు ఆధార్, ఇతర పత్రాలు అంగీకరించకుండా తాతముత్తాతల పత్రాలే అవసరమని చెప్పడం



విడ్డూరమన్నారు. ఆపరేషన్ సింధూరం విషయంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై మోడీ మౌనం వీడాలని డిమాండ్ చేశారు. పాకిస్తాన్ సైనాధికారి మునీర్‌కు ట్రంప్ విందు ఇవ్వడం దేశానికి అవమానకరమన్నారు. ట్రంప్ భారత్‌పై 25 శాతం సుంకాలు విధించడాన్ని ఖండించాల్సిన ధైర్యం మోడీకి లేదని విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన కాలయాపలతో సాగుతోందని, ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. వాగ్దానాల అమలుకు ప్రజా ఉద్యమాలు అవసరమని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగర్ ఎడమ కాలువ పరిధిలో ఉన్న లిస్టులను ప్రాజెక్టు అంతర్భాగంగా పరిగణించాలని, పెండింగ్‌లో ఉన్న రుణమాఫీ, రైతు భరోసా వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, పాలడుగు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ సిబ్బందిల ఏజెన్సీలను రెన్యువల్ చేయాలి

**నల్లగొండ,ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నల్లగొండ జిల్లాలో గల పలు మాడలాల్లో ఉన్నటువంటి 17 మోడల్ స్కూల్లో పొరుగు సేవలు అందిస్తున్న సిబ్బంది సోమవారం గ్రీవెన్స్ డే లో కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు జిల్లావ్యాప్తంగా 17 మోడల్ స్కూల్ లో పనిచేస్తున్న ఒక కంప్యూటర్ ఆపరేటర్, ఒక పిజికల్ డైరక్టర్, ఒక వాచ్ మెన్ మరియు ఒక అటెండర్ పని చేస్తున్నాము. మాకు గత ఐదు నెలలుగా ఏజెన్సీలకు రెన్యువల్ గత ఐదు నెలలుగా వేతనాలు రావట్లేదు. చాలీ చాలని వేతనాలతో పని చేస్తున్నటువంటి ఔట్సోర్సింగ్ సిబ్బంది



ఏజెన్సీలకు రెన్యువల్ చేసి జీతాలు వచ్చు విధంగా చేయగలరు. అదే విధంగా ప్రతినెల నెల జితాలు వచ్చే విధంగా ఏజెన్సీలు ప్రతక్షంగా అకౌంట్లో వేసే విధంగా చర్యలు తీసుకోవాలని, నల్లగొండ జిల్లాలోగల 17 మోడల్ స్కూల్లకు సంబందించిన ఏజేన్సీలను తొందరగ రెన్యూవల్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఔట్సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజ్యాధికారమే ఏకైక లక్ష్యం






**-మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పటం పురుషోత్తమ రావు**

**-ఎన్నికలతో మున్నూరు కాపుల ప్రతిష్ట తారాస్థాయికి....**

**-పాల్గొన్న అపెక్స్ కమిటీ సభ్యులు మీసాల చంద్రయ్య, రౌతు కనకయ్య....**

**-బుక్క వేణుగోపాల్ ఫామ్ హౌస్ లో అట్టహాసంగా మున్నూరుకాపు తొలి కార్యవర్గ సమావేశం..**

**శంషాబాద్, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మున్నూరు కాపులందరూ ఐక్యతతో ముందుకు పోతేనే రాజ్యాధికారం సాధ్యమని మున్నూరు కాపు కార్యవర్గ సమావేశంలో పలువురు ముక్తకంఠంతో సూచించారు. ఐక్యత లేమి తోనే చట్టసభలలో ప్రాతినిధ్యం లేకుండా పోతుందని సమావేశంలో పలువురు అభిప్రాయపడ్డారు. మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తమ రావు పటేల్ అధ్యక్షతన శంషాబాద్ లోని బుక్క వేణుగోపాల్ ఫామ్ హౌస్ లో సంఘం తొలి కార్యవర్గ సమావేశం జరిగింది. అపెక్స్ కమిటీ సభ్యులు మీసాల చంద్రయ్య, రౌతు కనకయ్య సంఘం రాష్ట్ర నాయకులు, తెలంగాణ నలుమూలల నుంచి ఈ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తమ రావు పటేల్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే మున్నూరు కాపు సంఘానికి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరగటం అద్భుతమని మిగతా కుల సంఘాలు ఈ ఎన్నికల ఘట్టాన్ని ఆదర్శంగా తీసుకొని వాళ్ల కార్యవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని చూస్తున్నారనీ అన్నారు. ఎన్నికలు జరపటం ఒక ఎత్తైతే, ఎన్నికల అనంతరం తాలూకా కో-ఆర్డినేటర్లకు చందానగర్ లో శిక్షణ తరగతులు రాష్ట్ర చరిత్రలోనే మొదటి సారి అని అన్నారు. మున్నూరు కాపు కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహిస్తున్నామని, ఇటీవల వేములవాడలో 400 కార్లతో ర్యాలీగా వెళ్లి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించి మున్నూరు కాపుల ప్రతిష్టను తారాస్థాయికి చేరేలా చేశామని పుటం పురుషోత్తమ రావు అన్నారు. అపెక్స్ కమిటీ సభ్యులు రౌతు



కనకయ్య మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘానికి ఎన్నికలు నిర్వహించడం మంచి సంప్రదాయమని, శిక్షణ తరగతులు మిగతా కులాలకు ప్రేరణగా నిలిచాయని, చలో వేములవాడ పై పెద్ద చర్చ జరిగిందని అన్నారు. అపెక్స్ కమిటీ సభ్యులు, జిల్లా బిజెపి అధ్యక్షులు మీసాల చంద్రయ్య మాట్లాడుతూ అపెక్స్ కమిటీ నిర్దేశకత్వంలో మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్రం పేరుతో ఒకే కులం ఒకే సంఘంగా ఉండాలని కొండా దేవయ్యను మూడు సంవత్సరాల క్రితం అధ్యక్షునిగా నియమిస్తే ఆయన ఒంటెద్దు పోకడలతో విసిగిపోయామని అయినప్పటికీ ఆయన పదవీకాలం మొత్తం భరించామని అపెక్స్ కమిటీ హెచ్చరించిన దేవయ్య మారలేదని అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఓపిగ్గా వ్యవహరించామని అన్నారు. అప్పుడు కొండా దేవయ్య ఏకగ్రీవ ఎన్నికకు ప్రస్తుత అధ్యక్షుడు పుటం పురుషోత్తమరావు కూడా సహకరించారని అన్నారు. అపెక్స్ కమిటీ రూపొందించిన బయల ప్రకారమే జూలై 29న ఎన్నికలు నిర్వహించామని అపెక్స్ కమిటీ బాధ్యతను సక్రమంగా నిర్వహించి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిపి, నూతన కార్యవర్గానికి వేములవాడలో ప్రమాణ స్వీకారం నిర్వహించి అంతకుముందే కోఆర్డినేటర్లకు శిక్షణ తరగతులు ఇచ్చి శంషాబాద్ లో తొలి కార్యవర్గ సమావేశాన్ని కూడా జరిపామని మీసాల చంద్రయ్య వివరించారు. ఉమెన్స్ వింగ్ ప్రెసిడెంట్ బండి పద్మ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేరకు దూర ప్రాంతాన్నించి వచ్చే మహిళలకు ఉమెన్స్ హాస్టల్ ను ఏర్పాటు చేయాలని ఇచ్చిన హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య స్వాగత పలుకులతో ప్రారంభమైన కార్యక్రమంలో ఇకముందు ఎలాంటి నిర్ణయాలు తీసుకున్న కార్యవర్గ ఆమోదంతోనే ఉండాలని, సంఘ రాష్ట్ర కార్యకలాపాలకు ఒక నిధిని ఏర్పాటు చేయాలని సంఘ కార్యక్రమాలను కార్యకలాపాలను గ్రామస్థాయికి తీసుకెళ్లి కుల బంధువులను చైతన్య పరచాలని అతి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మున్నూరు కాపులు అత్యధిక సంఖ్యలో ప్రజా ప్రతినిధులుగా గెలుపొందేలాగా చైతన్య పరచాలని, ప్రతి నియోజకవర్గ నుంచి వందమంది సభ్యులు చొప్పున పదివేల సభ్యత్వాన్ని పూర్తి చేయాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశానికి నూతన కార్యవర్గంతో పాటు వివిధ జిల్లా అధ్యక్షులు, అపెక్స్ కమిటీ సభ్యులు తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యనిర్వహణ అధ్యక్షులు బుక్క వేణుగోపాల్, డాక్టర్ జేవన్ పటేల్, కోశాధికారి, కంచి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు డాక్టర్ ఉప్పు రవీందర్, ఏలువాక రాజయ్య, విష్ణు జగతి, పర్వత సతీష్, కడారు రమేష్ బాబు, చింతలగట్టు యాదగిరి, కనకం అమర్ బాబు, వాసాల వెంకటేశ్వర్లు, కార్యదర్శులు ఉప్పు సత్యనారాయణ, ముత్యాల రాజశేఖర్, కర్ర వెంకటేశ్వర్లు, ఇందూరి తిరుపతి, మచ్చకుర్తి చంద్రమౌళి, గాజుల మహేందర్, తూము మనోజ్ కుమార్, సంయుక్త కార్యదర్శులు పోతంశెట్టి వెంకటేశ్వరరావు, బాపట్ల మురళి, అమీరిశెట్టి రామస్వామి, కందుల సృజన్ కాంత్, కార్యనిర్వాహన కార్యదర్శులు కాశెట్టి కుమార్, ఆకుల సత్యనారాయణ, కుంభం నరసింహ, సంయుక్త కార్యదర్శి అమిరిశెట్టి రామస్వామి, జిల్లాల అధ్యక్షులు వాసుదేవుల వెంకట నరసయ్య, బోప్ప దేవయ్య, కనుకుంట్ల రవి, మామిళ్ల అంజయ్య, కోరబోయిన వెంకటయ్య, పోగుల సారంగపాణి, నీలం నరసింహులు, పూదరి తిరుపతి, అమర్ బాబు, ఎల్ .రాజయ్య, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# డి-39, డి-40 కాలువలకు నీరు విడుదల చేయాలి

**-తిప్పర్తి రైతుల వినతి గ్రీవెన్స్ డేలో కలెక్టర్‌కు వినతిపత్రం**




**నల్లగొండ, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగార్జునసాగర్ నుండి 26 గేట్ల ద్వారా నీళ్లు విడుదలవుతున్నా, డి-39, డి-40 కాలువలకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదని తిప్పర్తి మండల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారు, జంగారెడ్డిగూడెం, తిప్పర్తి, చెర్వుపల్లి ప్రాంతాల్లో వరిపంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. ఉదయ సముద్రం చెరువును 1.5 టీఎంసీ నీటితో నింపాలని, ఎ.ఎం.ఆర్.పి వద్ద ఉన్న మోటర్లను నడిపించి ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని రైతులు కోరారు. చందనపల్లి వద్ద డి-40 కాలువ షెట్టర్లు పూర్తిగా ఎత్తి, పజ్జూరు, ఎర్రగడ్డలగూడెం, మామిడాల, శిలారిమియాగూడెం వంటి గ్రామాల చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. వారబంధీ ప్రకారం సాగు నీరు అందించకపోవడం వల్ల చివరి ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, కాలువల ద్వారా అన్ని చెరువులకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

# డిండిలో ఇంటింటికి బిజెపి ప్రచారం

**దేవరకొండ,ఆగష్టు 04(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రం లోభారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం,బిజెపి డిండి మండల అధ్యక్షులు సింకారు సైదాజీ



ఆధ్వర్యంలో ఇంటింటికి భారతీయ జనతా పార్టీ ప్రచారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతావత్ లాలు నాయక్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ 11 సంవత్సరాల కాలంలో చేసినటువంటి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రపంచంలో భారత దేశాన్ని విశ్వ గురువుగా నిలబట్టే ప్రయత్నం చేస్తున్న నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరచాలని కోరడం జరిగినది, అదేవిదంగా కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు, 66 హామీలు అమలుచేస్తామని అధికారంలోకి వచ్చి ,ఇచ్చిన హామీలను అమలుచేయలేక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కావునా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. మండలంలోని ప్రతి బూతులో పార్టీని సంస్థగతంగా బలోపేతం చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని అన్ని ఎంపీటీసీలు జడ్పిటిసి సర్పంచులను మరియు వార్డు మెంబర్లను గెలిపించాలని ప్రతి కార్యకర్త సైనికుల్లాగా పని చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు ఎలకుర్తి రమేష్, పట్టణ అధ్యకులు బాధమోని సాయి గౌడ్, పులిజాల రమేష్, నోముల సాయి,గుమ్మడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# మొండి గౌరెల్లి బిజెపి ఆధ్వర్యంలో మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం.





**యాచారం,ఆగస్టు 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** మొండి గౌరెల్లి గ్రామం లో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచంద్రరావు ఆదేశాల మేరకు ఇంటింటికి మహాభియాన్ సంపర్క కార్యక్రమాన్ని నిర్వహించారు. బిజెపి మహా సంపర్క్ అభియాన్ లో భాగంగా, ఇంటింటికి బిజెపి, ప్రతి ఇంటికి బూత్ అధ్యక్షుడు కార్యక్రమం .మొండి గౌరెల్లి గ్రామం లో ప్రారంభించడం జరిగింది, 49,50 బూత్ అధ్యక్షులు కర్నాటి నరేష్, యెడల్లి సత్తయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధులు బిజెపి మండల అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ , రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు మండల ఎన్నికల ప్రభారీ బోసుపల్లి ప్రతాప్ హాజరై మాట్లాడుతూ మోడీ పాలన 11 ఏళ్ల ఇళ్లలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని గ్రామాలలో పట్టణాలలో కేంద్ర ప్రభుత్వ పథకాలు పెద్ద ఎత్తున అమలవుతున్నాయని ఈ సందర్భంగా వారు అన్నారు . బిజెపి సీనియర్ నాయకులు జిల్లా కార్యవర్గ సభ్యులు మండల ఎన్నికల కన్వీనర్ మేకల యాదగిరి రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మర్రిపల్లి అంజయ్య యాదవ్ ,బిజెపి సీనియర్ నాయకులు కోలన్ మల్ల రెడ్డి, బిజెపి మాజి మండల అధ్యక్షులు తాంద్ర రవీందర్ తో కలిసి ఇల్లు ఇల్లు తిరిగి నరేంద్ర మోడి గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులకు సంబందించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో బిజెపి సీనియర్ నాయకులు గోగికర్ రమేష్, ఆంబోజి జగదీశ్ యాదవ్, కొండా మధుకర్ రెడ్డి, రాయకంటి విజయ్ కుమార్,నాయిని పాండు రంగా రెడ్డి, పుష్పాల శాంతి కుమార్ బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ వన్నవాడ రవీందర్ రెడ్డి, ఎలిమినేటి శ్రీనివాస్ రెడ్డి, మాధం జంగయ్య, దేవరకొండ ఈశ్వర్, కుంచారం సందీప్ రెడ్డి, గుడాల వెంకటేష్, కుంటి మల్లేష్ కొండాపురం నాగరాజు, రమేష్ ముదిరాజ్, లింగం, మండల లక్ష్మయ్య, కమ్మరి దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ చందాలు చేయని గ్రామంగా మైసిగండి ఆదర్శం

**-నూతనంగా ఎన్నికైన గణేష్ ఉత్సవ కమిటీని సన్మానించిన టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్**



**కడ్తాల్, ఆగస్ట్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మైసిగండి గ్రామంలో గణేష్ ఉత్సవాల నిర్వహణ కోసం నూతన కమిటీని గ్రామ పెద్దల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా సభవత్ వినోద్ నాయక్, వైస్ చైర్మన్‌గా జరుపుల నరేష్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా సభవత్ రాము నాయక్, కార్యదర్శిగా విస్లావత్ సుధీర్ నాయక్, కోశాధికారిగా కేతావత్ తులసిరామ్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే 10 మంది కార్యవర్గ సభ్యులను, గ్రామ పెద్దలను ముఖ్య సలహాదారులుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ"మైసిగండి గ్రామం గత ముప్పై సంవత్సరాలుగా చందాలు లేకుండా గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్నది గర్వకారణం. లడ్డు ధర ఎక్కువగా ఉన్నా, ఎవరికీ భారం లేకుండా పండుగ జరుపుతున్న ప్రజలు ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తున్నారు" అని ప్రశంసించారు. ఐకమత్యంతో పండుగ జరుపుకోవడం, ఒకే రోజు నిమజ్జనం చేయడం, కొత్త బట్టలతో పూజలు నిర్వహించడం మైసిగండికి ప్రత్యేకత అని పేర్కొన్నారు. నూతన కమిటీని ఘనంగా సన్మానించి, పాత కమిటీ సభ్యుల సేవలను అభినందించారు. గత మూడు సంవత్సరాలుగా సేవలందించిన గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ కేతావత్ హీరాసింగ్ నాయక్, ఉపాధ్యక్షులు సభవత్ రామునాయక్, సభవత్ యాదగిరి నాయక్ తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తులసిరామ్ నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగురి వెంకటేష్, భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దుద్యా నాయక్, జహార్ లాల్ నాయక్, హీరాసింగ్ నాయక్, తులసిరామ్ యాదగిరి, రాము కొర్ర, శీను, రమేష్, భోని శంకర్, గోపి, అమర్ సింగ్, చిన్న సుధీర్, చందు, అర్జున్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన కోటా -పరిచయ్ 2కే25 సంబరాలు

**-కోటా ఇన్స్టిట్యూట్ ప్రెషర్స్ పార్టీ ఘనంగా**



**కరీంనగర్, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కరీంనగర్‌లోని కోటా ఇన్స్టిట్యూట్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం కోటా-పరిచయ్ 2k25 పేరుతో ప్రెషర్స్ పార్టీ కార్యక్రమం సోమవారం రేకుర్తిలోని ప్రైవేట్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. కోటా ఇన్స్టిట్యూట్, కోటా పబ్లిక్ స్కూల్ చైర్మన్ డా. అంజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనే తత్వం, నైతిక విలువల ప్రాముఖ్యతపై సూచనలు చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డా. అంజిరెడ్డి జన్మదిన వేడుకలు కూడా ఘనంగా నిర్వహించారు. మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రదర్శించిన జానపద, శాస్త్రీయ, రాక్ నృత్యాలు, పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. ప్రిన్సిపాల్ B.సుదర్శన్, అధ్యాపక బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు కుట్టు మిషన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నారాయణ రెడ్డి




**మాడుగుల, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాడుగుల మండలం ఇర్విన్ గ్రామానికి చెందిన క్రిస్టియన్ మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రత్యేకంగా హాజరై కాసు రాణి, తుమ్మ పౌలిన్, తుమ్మ శృతి (ఇర్విన్), తలకొండపల్లి మరియు ఆమనగల్లు మండలాల లబ్ధిదారులకు మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని సీనియర్ నాయకులు సూదిని శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎంసీ డైరెక్టర్ జెల్ల రమేష్ గౌడ్, ఎరుకల శివకుమార్ గౌడ్, తుమ్మ జోజి రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీకి కాంగ్రెస్ శ్రేణులు

**ఆగస్టు 6న జంతర్ మంతర్ వద్ద ధర్నాకు సిద్ధం**



**కందుకూరు, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలో బీసీ రిజర్వేషన్ల సాధన కోసం డైనమిక్ లీడర్ దంతోజి నరసింహాచారి ఢిల్లీ ధర్నాలో పాల్గొననున్నట్లు ప్రకటించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు డిమాండ్ చేస్తూ, ఆగస్టు 6న జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ ధర్నాలో కేఎల్ఆర్, డీబీఆర్తో కలిసి నరసింహాచారి పాల్గొననున్నారు ఈ ధర్నాకు రాష్ట్రం నలుమూలల నుంచి బీసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరానున్నారని, కందుకూరు మండల కార్యకర్తలు, అభిమానులు కూడా ఢిల్లీ యాత్రకు సిద్ధమవుతున్నారని నరసింహాచారి తెలిపారు.

## తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన గట్టు రాజు



**వనపర్తి,ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, ఢిల్లీకి వెళ్తున్న రైలు ప్రయాణంలో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత రాజకీయ అంశాలపై చర్చించిన ఆయన, స్థానిక సంస్థల ఎన్నికల్లో త్యాగం చేసిన కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మీనాక్షి నటరాజన్ పార్టీ బలోపేతానికి సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ పనితీరు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా గట్టు రాజు మాట్లాడుతూ బీసీల హక్కుల కోసం "చలో ఢిల్లీ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే ఉద్దేశంతో వనపర్తి నుంచి కాంగ్రెస్ నేతలు బయలుదేరినట్లు తెలిపారు.

## ప్రమాద భీమా చెక్కుల పంపిణీ



**ఎలిగేడు, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు సోమవారం శివపల్లి నివాసంలో విద్యుత్ ప్రమాద భీమా చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. పెగడపల్లి గ్రామానికి చెందిన నక్కల రవి విద్యుత్ ఘాతానికి మృతిచెందగా, కుటుంబానికి 5 లక్షలు,కూనారం గ్రామానికి చెందిన సుద్దాల శ్రీనివాస్ బర్రె ప్రమాదానికి 40,000,ఎదులాపూర్ గ్రామానికి చెందిన పాణికాల కనకయ్య ఎద్దు ప్రమాదానికి 40,000 చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

**ఆమనగల్ మైనర్ బాలికపై లైంగిక దాడి ఘటనలో తీర్పు**

**షాద్‌నగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అమనగల్‌కు చెందిన మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికంగా వేధించిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష పడింది. 2021లో కేసు నమోదైన అనంతరం విచారణ కొనసాగింది. నేరం రుజువుకావడంతో షాద్‌నగర్ పోక్సో కోర్టు ఈ శిక్షను విధించింది. దర్యాప్తులో సీఐ జే.ఉపేందర్, డీఎస్పీ పి.కుశల్కర్, కోర్ట్ కానిస్టేబుల్ వెంకటేష్ యాదయ్య, కానిస్టేబుల్ జగన్ కీలక పాత్ర పోషించారు.

## ఆరు గ్యారెంటీల అమలుపై బీజేపీ ధర్నా

**కడ్తాల్ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన**





**కడ్తాల్, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కడ్తాల్ మండల కేంద్రంలో సోమవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుపై నిరసన ధర్నా నిర్వహించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు దోనాదుల మహేష్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ధర్నాకు తల్లోజీ ఆచారి, మాజీ ఎంపీ పోతుగంటి రాములు, హరి ప్రసాద్, మాన్యా నాయక్, సాయిలాల్ నాయక్ తదితర నాయకులు హాజరై, పెన్షన్ పెంపు, రైతు భరోసా, మహాలక్ష్మి పథకం వంటి హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఆర్వోకు మెమోరాండం అందజేశారు.

# “విలేకరులకు అ ఆ లు రావు అనే వ్యాఖ్య బాధకరం”

**గంగవరం రామకృష్ణారెడ్డి**



**వనపర్తి,ఆగస్టు 4( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** “విలేకరులకు అ ఆ లు రావు” అన్న వ్యాఖ్య నిన్నటి మాట కాదు… కానీ దాని వెనుక ఉన్న ఉద్దేశం ప్రజలకు ఇప్పుడే స్పష్టమవుతోంది. ఈ వ్యాఖ్య రాజకీయ ప్రయోజనాల కోసమే చేయబడినదా? లేక విలేకరుల చదువు స్థాయి పట్ల నిజమైన ఆందోళనా? అని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి గంగవరం రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు.“మీరు నిజంగా విలేకరుల అభివృద్ధిని కోరుకుంటే…”గత 18 నెలల్లో జర్నలిస్టుల సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు తీసుకున్న చర్యలు ఏమిటి? గ్రామీణ విలేకరుల కోసం శిక్షణా శిబిరాలా? అభ్యాస అవకాశాలా? కనీస భద్రతా చట్టాలైనా? అని ఆయన ప్రశ్నించారు. “మీకు కంటెంట్ నచ్చకపోవచ్చు, కానీ మీడియా స్వేచ్ఛను తక్కువ చేసే వ్యాఖ్యలు నాయకత్వ స్థాయికి తగవు,” అన్నారు రామకృష్ణారెడ్డి.పాత అక్రిడేషన్లకు స్టిక్కరింగ్ విధానం అన్యాయం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ… గతంలో మూడు నాలుగు ఏళ్లుగా పనిచేస్తున్న విలేకరులు అక్రిడేషన్ మంజూరు విషయంలో తీవ్ర అన్యాయాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్టిక్కరింగ్ విధానం వల్ల ఇప్పటికే పనిచేస్తున్న విలేకరులు అప్రమత్తంగా ఉన్నప్పటికీ గుర్తింపు లేక ఇబ్బందులు పడుతున్నారు. “అక్రిడేషన్‌లు మంజూరు చేయడం పెద్ద పని కాదు. ప్రభుత్వం తలచుకుంటే 10 రోజుల్లోనే ఇది సాధ్యమవుతుంది,” అని స్పష్టం చేశారు.జర్నలిజం = అక్షర జ్ఞానం కాదు, నిజాయితీకి ప్రతిబింబం“మీడియాను అణగదొక్కాలన్న ప్రయత్నాలు ప్రజల ముందు నిలబడవు. జర్నలిజం అంటే కేవలం అక్షర జ్ఞానం కాదు, అది ప్రజలకు నమ్మకంగా నిలిచే నిజాయితీకి ప్రతిబింబం,” అంటూ ఆయన వ్యాఖ్యానించారు.

# శిక్షణ తరగతులు అన్ని కులాలకు ప్రేరణ...

- -అపెక్స్ కమిటీ సభ్యులు రౌతు కనకయ్య...
- -చలో వేములవాడపై పెద్ద చర్చ జరిగింది...
- -సభ్యత నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి...
- -సమాజంలోని అసమానతలను తొలగించాలి




**శంషాబాద్, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అపెక్స్ కమిటీ సభ్యులు రౌతు కనకయ్య మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘానికి ఎన్నికలు నిర్వహించడం మంచి సంప్రదాయమని, శిక్షణ తరగతులు మిగతా కులాలకు ప్రేరణగా నిలిచాయని, చలో వేములవాడ పై పెద్ద చర్చ జరిగిందని, కుల గౌరవాన్ని పెంపొందించాలని, కులం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు పనిచేసేవారని, కులం బలంగా ఉంటే ఆ గౌరవం అందరికీ వస్తుందని రౌతు కనకయ్య అన్నారు. ఎన్నికలలో కులమే కీలకమని, జిల్లాలలోని మారుమూల పల్లెల నుంచి డాటా ను సమీకరించాలని, గ్రామ సంఘాల ద్వారా సభ్యత నమోదు కార్యక్రమాన్ని తప్పక చేయాలని, సమాజంలోని అసమానతలను తొలగించాలని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి వరాల దేవయ్య మాట్లాడుతూ ఇటీవల వేములవాడలో ఏర్పాటుచేసిన ప్రమాణస్వీకారం కుల సంఘం ప్రతిష్టను పెంచిందని, సంఘం తరపున వార్షిక డైరీ ని రూపొందిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొన్న వెంకటరమణ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలోని దాదాపు 25 లక్షల జనాభా మున్నూరు కాపులు ఉన్నారని అన్నారు. ఇటీవల జరిగిన బీసీ కుల జనగణనలో మున్నూరు కాపులు చురుకుగా పాల్గొనలేదన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాతబస్తీ లో చురుకుగా వ్యవహరించే విధంగా రాష్ట్ర కమిటీ చొరవ తీసుకోవాలని అన్నారు. సిరిసిల్ల రాజన్న జిల్లా అధ్యక్షులు బొప్ప దేవయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కుల గణన సర్వేలో కుల బంధువులు పాల్గొనక పోవడం వల్లనే మనం మొదటి స్థానాన్ని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి కో-ఆర్డినేటర్ నీలం నరసింహులు మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గానికి ఇటీవల జరిగిన ఎన్నికలలో కోఆర్డినేటర్ల వ్యవస్థనే కీలకంగా వ్యవహరించిందని, మూడు సంవత్సరాల క్రితం నాగార్జునసాగర్ లో జరిగిన సమావేశంలో కోఆర్డినేటర్ల వ్యవస్థకు ప్రాధాన్యత లభించిందని అన్నారు. కోఆర్డినేటర్ల ఏర్పాటులో రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తమరావు పాత్ర మరువలేనిది అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఐక్యతతోటే విజయం సాధిస్తామని, విభేదాలుంటే విజయం సాధించడం కష్టమని అన్నారు.

# షేక్పేట్ డివిజన్ వినాయక్ నగర్ లో మంత్రుల పర్యటన...



**షేక్పేట్, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** షేక్పేట్ డివిజన్ పరిధిలో నగర్ లో మంత్రులు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్, తుమ్మల నాగేశ్వరరావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ నిజాం బాయ్, రాజు,అప్రోచ్, ప్రీతి, రమేష్, జ్యోతి, సోనీ, మక్బూల్, ముజీబ్, ఓమార్ తదితరులు పాల్గొన్నారు.

# తాటి చెట్టు నుంచి పడి గీత కార్మికుడు మృతి

**ఎలిగేడు మండలంలో విషాదం**



**ఎలిగేడు, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామానికి చెందిన గీత కార్మికుడు కోట లింగయ్య గౌడ్ (55) తాటి చెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. ఉదయం 7 గంటల సమయంలో కల్లు గీసేందుకు చెట్టు ఎక్కిన ఆయన, జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. తోటి కార్మికులు వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అనంతరం కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు.నిరుపేద కుటుంబానికి చెందిన లింగయ్య గౌడ్ కుటుంబానికి 25,000 ఎక్స్‌గ్రేషియా అందించాలని గౌడ సంక్షేమ సంఘం నాయకులు చీకటి సంతోష్ గౌడ్, వేగోళం శంకర్ గౌడ్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, పూరెల్ల శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

# కాంగ్రెస్ లో చేరిన బిఆర్ఎస్ నేతలు



**పదర, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అచ్చంపేట నియోజకవర్గం పదర మండలంలో మాజీ జెడ్పిటిసి రాంబాబు నాయక్, సీనియర్ నేత ఎర్రం నరసింహ (బంగారు రాజు) సోమవారం బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. అచ్చంపేట అభివృద్ధి కాంగ్రెస్ వల్లే సాధ్యమని నమ్మి పార్టీలో చేరినట్లు నేతలు తెలిపారు.

# అమెరికా బయలుదేరిన ఠాకూర్ ప్రణవ్ గోపాల్ సింగ్

**డ్యూక్ యూనివర్సిటీలో పై చదువులకు అమెరికాకు**





**హైదరాబాద్, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీ సింగ్ కుమారుడు ఠాకూర్ ప్రణవ్ గోపాల్ సింగ్ పై చదువుల కోసం అమెరికా నార్త్ కరోలినా స్టేట్‌లోని డ్యూక్ యూనివర్సిటీకి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావులను మర్యాదపూర్వకంగా కలిగి ఆశీస్సులు పొందారు.ఏరోస్పేస్ రంగంలో ప్రతిభ కనబరిచి తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సీఎం ఆకాంక్షించారు. యువతలో విద్యాపట్ల ఆసక్తి, దేశానికి సేవ చేసే తత్వం పెంపొందించాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.ఠాకూర్ ప్రణవ్ గోపాల్ సింగ్ విద్యార్జనలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్రానికి గౌరవం తీసుకురావాలని పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# బీఆర్ఎస్‌కు గువ్వల గుడ్‌బై

**- కేసీఆర్‌కు రాజీనామా లేఖ**



**అచ్చంపేట, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సోమవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి, లేఖను పార్టీ అధినేత కేసీఆర్కు పంపారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా గెలిచిన బాలరాజు, పార్టీకి అత్యంత నమ్మకస్తుడిగా గుర్తింపు పొందారు. అయితే ఇటీవల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం, అచ్చంపేట నియోజకవర్గం జనరల్‌గా మారే అవకాశాలు, అంతర్గత విభేదాలు వంటి అంశాల నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.రాజీనామా అనంతరం బీజేపీలో చేరే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామం పాలమూరు జిల్లాలోనే కాక, రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# విద్యార్థుల ఆరోగ్యం, నాణ్యమైన విద్యకు పెద్దపీట

**గురుకులాల్లో స్టీల్ పాత్రల వినియోగానికి శ్రీకారం**



**కరీంనగర్, ఆగస్టు4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కరీంనగర్ జిల్లా అలుగునూరులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం స్టీల్ పాత్రల్లో వంటావార్పు కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. పాఠశాలలో వంట గదులు, భోజనశాలలను పరిశీలించిన మంత్రి, విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసి అసెంబ్లీలో పాల్గొన్నారు.అల్యూమినియం పాత్రల వినియోగం ఆరోగ్యానికి హానికరమని, అందుకే రాష్ట్రంలోని 700 గురుకులాల్లో స్టీల్ పాత్రల వినియోగాన్ని దశలవారీగా అమలు చేస్తామని మంత్రి తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, బలవర్ధక ఆహారం, నాణ్యమైన విద్యలే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గురుకులాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# షేక్ పెట్ డివిజన్ లో కాంగ్రెస్ పర్యటన...

**పాల్గొన్న అంజన్ కుమార్...**



**షేక్పేట్, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అతి త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ స్పీడ్ పెంచింది. అందులో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని షేక్పేట్ డివిజన్ లో విస్తృతంగా పర్యటిస్తుంది. సోమవారం మాజీ ఎంపీ వివేకానంద నగర్ లో డివిజన్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజన్ కుమార్ మాట్లాడుతూ అతి త్వరలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికల్లో విజయం సాధించడమే కాంగ్రెస్ పార్టీ ఏకైక లక్ష్యం అని అన్నారు. షేక్పేట్ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీకి జనరల్ ఎలక్షన్స్ లో వచ్చిన దానికంటే డబుల్ ఆధిక్యం వచ్చేలా కార్యకర్తలు ఇప్పటినుంచే కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరు అన్నది ఇప్పుడు అప్రస్తుతం అని, పార్టీ విజయమే ముఖ్యమని అంజన్ కుమార్ యాదవ్ కార్యకర్తలకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డి.సత్యనారాయణ తో పాటు మోయిన్ బాయ్, అశోక్, సదానంద్, లింగం, సిహెచ్.సదానంద్ పెంటయ్య, సారా, వెంకటేష్, అప్రోచ్, ప్రీతి, సోనీ, రమేష్, మక్బూల్, ముజీబ్, ఓమార్ ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం

**ధూళికట్ట అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం**



**ఎలిగేడు, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం నెం.3 భూరన్మీయపేటలో సోమవారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె దవాఖాన వైద్యురాలు సింధూర మాట్లాడుతూ, “తల్లి పాలు బిడ్డకు సంపూర్ణ పోషకాహారం అందించడమే కాక, వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి” అని వివరించారు.తల్లి పాలు ఇవ్వకపోవడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ప్రభావతి, ప్రేమలత, ఏఎన్ఎమ్, ఆశా కార్యకర్తలు, తల్లులు, గర్భిణీలు, చిన్నారులు పాల్గొన్నారు.

# మారుపాకలో బీజేపీ మహా సంపర్క్ అభియాన్

ఇంటింటికీ కేంద్ర పథకాల ప్రచారం



**వేములవాడ, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా వేముల వాడ నియోజకవర్గంలోని మారుపాక గ్రామంలో బీజేపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. బూత్ నంబర్లు 193, 195 పరిధిలో ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ముఖ్య అతిథులుగా హాజరై, కార్యకర్తలను ఉత్సాహపరిచారు. అనంతరం వారిని శాలువాలతో సన్మానించారు. కేంద్ర ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత వైఖరిని ఎండగట్టే కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వేములవాడ అర్బన్ మండల అధ్యక్షులు బుర్ర శేఖర్ గౌడ్, రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్, నంద్యాడపు వెంకటేష్, వెంకటేశ్వరరావు, రాకేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచన



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 11న జిల్లాలోని అంగన్వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో 1-19 ఏళ్ల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ప్రజావాణి అనంతరం నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి, పాఠశాలల్లో ఫర్నిచర్ వాడకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి అని సూచించారు. పాఠశాలల్లో పిపిటి ప్రదర్శనలు, విద్యార్థుల కూర్చోవడానికి బెంచీలు లేదా మ్యాట్లు వినియోగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా 290 ప్రజావాణి దరఖాస్తులు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు బదిలీ చేశారు. కస్తూరిబా బాలికల విద్యాలయాల్లో నిర్వహించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మేళాను కలెక్టర్ సందర్శించి, విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు.

# బూత్ స్థాయిలో మహా సంపర్క్ కార్యక్రమం చేపట్టిన బిజెపి పార్టీ



**బల్మూర్,ఆగస్టు 4( నీలగిరి ఎక్స్ ప్రెస్):** బల్మూరు మండల కేంద్రంలో, రాష్ట్ర బిజెపి పార్టీ పిలుపు మేరకు ప్రతి ఇంటికీ బిజెపి రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గోదల్ గ్రామంలో 204,205 వ బూత్ లో ఇంటింటికి వెళ్లి బీజేపీ బల్మూరు మండల సోషల్ మీడియా కన్వీనర్ అనిల్ ముదిరాజ్,ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం లో సాగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో కార్యకర్తలు గణేష్ అనిల్ ,తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఎమ్మెల్ రెడ్డి రంగారెడ్డి

**ఇబ్రహింపట్నం , ఆగస్టు 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందేలా చూస్తున్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. అనాజ్ పూర్ , గుంతపల్లి మజీద్ పూర్ గ్రామాలలో దాదాపు 80 లక్షలతో నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. అనాజ్ పూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఏడు తలకాయల మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఏమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి , రాష్ట్ర రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంధ్భంగా అనాజ్ పూర్ గ్రామంలో పెద్ద ఎత్తున ఏమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఘన స్వాగతం పలికిన కాంగ్రేస్ పార్టీ శ్రేణులతో కలిసి హరిత హారం కార్యక్రమంలో మొక్కలను నాటిన ఎంఎల్ఏ మల్ రెడ్డి రంగారెడ్డి అధికారులు మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ. గ్రామాల అభివృద్ధి కోసం ఎన్ని నిధులు అయినా మంజూరు చేస్తామని. అర్హులైన



వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పారు. ప్రజా సంక్షేమం కోసమే పనిచేస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని 200 యూనిట్ల లోపు గృహ జ్యోతి అమలు చేస్తున్నామని అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని . రైతు బరోసా రైతు ఋణ మాఫీ అందించామని తెలిపారు. మహిళల కు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని...వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం లో అభివృద్ధికి గ్రామాలు నోచుకోలేదని...కేవలం గత ప్రభుత్వం కమిషన్లు దండుకోని గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి రోజు ప్రజల కోసం పని చేస్తున్నామని చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రేస్ గెలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ , మల్ రెడ్డి రాంరెడ్డి ,గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి , వైస్ చైర్మన్ భాస్కర చారి ,మాజీ జెడ్పీటీసీ బింగి దేవదాస్ గౌడ్ ,మండల పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ గౌడ్ గుంతపల్లి మాజీ సర్పంచ్ కరిమెల వెంకటేష్ , మాజీ ఎంపీటీసీ మేడిపల్లి బాలమ్మ వెంకటేష్ తో పాటు నాయకులు గుండ్లపల్లి ధన్ రాజ్ గౌడ్, ఏళ్ల బాల్ రెడ్డి ,ఏళ్ల నరేందర్ రెడ్డి, ఏర్కలి అశోక్ గౌడ్ , పాలెం శ్రీనివాస్ గౌడ్, ఏర్పుల శివయ్య , నార్లకొండ శ్రీశైలం యాదవ్ , కంటేకార్ రమేష్ , శ్రీధర్, ఎండీ అఫ్సర్ తో పాటు పలువురు అధికారులు కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మీ ఆరోగ్యం మా బాధ్యత

– టాస్క్ సీవోవో,ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రెడ్డి

**ఆమనగల్లు, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ల మీ ఆరోగ్యం మా బాధ్యత నినాదంతో కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో గ్రామ, గ్రామాన సుంకిరెడ్డి - మొబైల్ హెల్త్ ఏర్పాటు చేయడం జరుగుతుందని టాస్క్ సిఓఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సోమవారం ఆమనగల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఐక్యత ఫౌండేషన్ ముఖ్య లక్ష్యం నియోజకవర్గ వ్యాప్తంగా విద్య - వైద్యం - ఉపాధి రంగాలలో ప్రతి కుటుంబానికి అండగా ఉండాలనే ధృడ సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని,మా సంకల్పం ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి ప్రాథమిక వైద్యసేవలు ఉచితంగా అందుబాటులో ఉంచి, ఆరోగ్యవంతమైన నియోజకవర్గంగాచూడాలనే ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. సుంకిరెడ్డి మొబైల్ హెల్త్ క్యాంపులను వన్ మెడి హబ్ అనే ప్రముఖ సంస్థతో కలిసి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో




ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సుంకిరెడ్డి మొబైల్ హెల్త్ క్లినిక్ యొక్క ముఖ్య ఉద్దేశ్యాలు. ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి ఉచిత ప్రాథమిక వైద్యసేవలను అందించడం,పెద్ద పెద్ద వ్యాధులను ముందుగా గుర్తించి, వాటిని అడ్డుకోకునే,సూచనలు సలహాలు, ప్రతి మారుమూల గ్రామంలో కూడా ఆరోగ్యం పై అవగాహన కల్పించి, వారిని చైతన్య పరచడం, సుంకిరెడ్డి మొబైల్ హెల్త్ క్యాంప్ ద్వారా ముఖ్యంగా ఆధునాతన టెక్నాలజీ తో రూపొందించిన వన్ మెడి హబ్ మొబైల్ క్లినిక్ ద్వారా ఒక గంటలో 150 పైగా పరీక్షలు నిర్వహించే సామర్థ్యంతో డిజైన్ చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షలు చాలా ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ అని, పేద ప్రజలు అందుబాటులో ఉండే విధంగా మొబైల్ మెడికల్ బస్సును ఏర్పాటు చేశామని వారన్నారు మొదటగా ఆమనగల్ మండలం మేడిగడ్డ తండాలో ఈనెల 6వ తారీఖు బుధవారం రోజున ప్రారంభించబోతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వన్ మెడి హబ్ ఫౌండర్ సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు మండ్లి రాములు, మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, మాజీ ఉపసర్పంచ్ మల్లేష్ నాయక్, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు అభినవ్ రెడ్డి, యువజన నాయకులు దుడ్డు కృష్ణ యాదవ్ లతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విహెచ్ చేతుల మీదుగా సీనియర్ జర్నలిస్ట్ మహమ్మద్ రఫీకి దేశభక్తి జన్ అవార్డు ప్రధానం....

**హైదరాబాద్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సీనియర్ జర్నలిస్ట్ మహమ్మద్ రఫీ కి దేశభక్తి జన్ అవార్డు ప్రకటించడం జరిగింది. ఈ మేరకు రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో మహమ్మద్ రఫీకి మాజీ ఎంపీ వి.హనుమంతరావు చేతుల మీదుగా దేశభక్తి జన్ అవార్డు బహూకరణ జరిగింది. మహమ్మద్ రఫీ పూర్వపరాలోకి వస్తే 32 ఏళ్ల పాత్రికేయ అనుభవం, ఆంధ్రజ్యోతి సబ్ ఎడిటర్ గా, వార్త చీఫ్ రిపోర్టర్ గా, హెచ్ఎం టివి అసోసియేట్ ఎడిటర్ గా, మహా న్యూస్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ గా, కళ పత్రిక చీఫ్ ఎడిటర్ గా సేవలు అందించి ప్రస్తుతం ఇండియా నౌ టివి సిఇవో గా ఉన్నారు. మరోవైపు ప్రభుత్వంలో రెవెన్యూ డిపార్ట్మెంట్ లో పీఆర్వో గా పని చేస్తున్నారు. 22 దేశాల్లో తెలుగు సంఘాలతో మమేకమై 600 అవార్డులు మూడు వేల సన్మానాలు



అందుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉత్తమ పాత్రికేయ పురస్కారం ఆరు సార్లు స్వీకరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2020 నుంచి రెండేళ్ల పాటు కేంద్ర సామాజిక న్యాయ శాఖ ఆధ్వర్యంలో హ్యూమన్ రైట్స్ మిషన్ చైర్మన్ గా వ్యవహరించారు. ప్రతిష్టాత్మకంగా ఢిల్లీలో జరిగిన జీ20 సదస్సులో మీడియా కమిటీ చైర్మన్ గా సేవలు అందించారు. ప్రపంచంలోని తెలుగు సాంస్కృతిక సంఘాలను సమన్వయం చేస్తూ సాంస్కృతిక వికాసం కోసం కృషి చేస్తున్నారు. కళాకారుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తూ కళాకారులకు ప్రభుత్వానికి కళా వారధిగా గుర్తింపు పొందారు. ఇదిలా ఉండగా సీనియర్ జర్నలిస్ట్ మహమ్మద్ రఫీ కి దేశభక్తి జన్ అవార్డు లభించడం పట్ల ఉమ్మడి రాష్ట్ర ఏపీయూడబ్ల్యూజే మాజీ కార్యవర్గ సభ్యులు కూకట్పల్లి ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు వార్త జోన్ ఇన్చార్జి బి.వెంకటేశ్వర్లు హర్ష వెలిబుచ్చారు.

# పర్మిషన్ లేకుండా నడుస్తున్న కళాశాలలు మూసివేయాలి

-యూఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్

**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో పర్మిషన్ లేకుండా నడుస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలలను తక్షణమే మూసివేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారు, డీఐఈవోకు తగిన ఆదేశాలు



ఇవ్వాలని కోరారు. యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంద గణేష్ మాట్లాడుతూ, “ఒకే క్యాంపస్ పేరుతో అనేక కళాశాలలు అనుమతి లేకుండా నడుస్తున్నాయి. శ్రీ చైతన్య, ట్రినిటీ వంటి సంస్థల్లో వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. హాల్ టికెట్ల ఆలస్యం, అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోంది” అని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన కార్యక్రమంలో అభిలాష్, మణి తేజ, సాయి జీవన్, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్ జిల్లా దొంగ అరెస్ట్






-దొంగసొత్తు కొనుగోలు చేసిన బంగారు వ్యాపారి కూడా పట్టుబాటు

**కరీంనగర్, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిజామాబాద్ జిల్లా కమ్మరపల్లి గ్రామానికి చెందిన టేకు చిరంజీవి (22) అనే అంతర్ జిల్లా దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతను ప్రస్తుతం ఆర్మూర్ మండలంలోని ఏసపల్లిలో నివాసముంటూ హార్వెస్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన చిరంజీవి, సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో పగలంతా తాళం వేసిన ఇళ్లను గుర్తించి, రాత్రిపూట చోరీలకు పాల్పడుతున్నాడు. మారుతి ఫ్రాంక్స్ కారు (టీజీ-16-ఏ-7015)లో కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో పలు గ్రామాల్లో దొంగతనాలు చేసినట్లు విచారణలో అంగీకరించాడు. చిరంజీవి మే 7న వేల్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పచ్చల నడ్కుడ గ్రామంలో 66 గ్రాముల బంగారం దొంగిలించి, తన తండ్రి గంగ సాయిలు సహాయంతో నందిపేటలోని బంగారు నరసయ్యకు విక్రయించాడు. అలాగే జూన్ 10న గన్నేరువరం మండలంలో, జూన్ 30న శానగర్, జూలై 16న గంగిపల్లి, జూలై 22న పోరండ్ల, జూలై 23న బొమ్మనపల్లి, జూలై 24న చీమలకుంటపల్లి గ్రామాల్లో వరుసగా దొంగతనాలకు పాల్పడి బంగారం, వెండి, నగదు దొంగిలించాడు. దొంగసొత్తు కొనుగోలు చేసిన నందిపేట మండల కేంద్రానికి చెందిన బంగారు నరసయ్య (44)ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతను తక్కువ ధరకు దొంగిలించిన ఆభరణాలను కొనుగోలు చేస్తూ, మే 10న 66 గ్రాముల బంగారం కోసం రూ. 1,14,000 చెల్లించినట్లు విచారణలో వెల్లడైంది. పోలీసులు నిందితుల వద్ద నుండి మొత్తం 18 తులాల బంగారం, 164 తులాల వెండి, రూ. 1,00,000 నగదు, మొబైల్ ఫోన్, మారుతి ఫ్రాంక్స్ కారు, ఇనుప రాడ్లు, గ్లౌజులు వంటి పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన ఏసిపి వెంకటస్వామి, సీసీఎస్ ఏసిపి జాన్ నర్సింహులు, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సదన్ కుమార్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ ప్రకాష్, ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్, క్రైమ్ పార్టీ కానిస్టేబుళ్లు నరేష్, జైపాల్, రాజశేఖర్, వేణుగోపాల్, అనిల్, అవినాష్‌లను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు.

## యువత ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

డీట్రైల్స్ ప్లాట్‌ఫామ్‌పై కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సూచన



**రంగారెడ్డి, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ ప్లాట్‌ఫామ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీట్రైల్స్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన, ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా ఏఐ ఆధారంగా విద్యార్హతలు, నైపుణ్యాల ప్రకారం ఉద్యోగ సమాచారం అందుతుందని తెలిపారు. ఉచితంగా నమోదు చేసుకుని, ప్రైవేట్ రంగ సంస్థల ఖాళీలకు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డిఆర్ఓ సంగీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బోల్లపల్లి పిహెచ్సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి: హనుమంతరావు




**బోల్లపల్లి, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** యాదాద్రి భువనగిరి జిల్లా బోల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా సందర్శించారు. ఉద్యోగుల హాజరు పట్టిక, గర్భిణీ స్త్రీలకు అందుతున్న వైద్య సేవలు, ప్రసవానంతర సేవలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అన్ని రికార్డులు పరిశీలించిన అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందించాలన్నదే లక్ష్యమని, ప్రజల్లో ప్రజా వైద్య వ్యవస్థపై నమ్మకం పెరగాలన్నారు. అనంతరం ఆయుష్మాన్ ఆయుర్వేద కేంద్రాన్ని సందర్శించి అక్కడి సేవలను సమీక్షించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ యామిని శృతి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న మహిళను కాపాడిన పోలీసులు

ఎస్సై రమేష్ నేతృత్వంలో సాహసోపేత రక్షణ




**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కిసాన్ నగర్‌కు చెందిన బోజనపల్లి స్వరూప (30) కుటుంబ సమస్యలతో లోయర్ మానేరు డ్యామ్‌లో ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనలో లేక్ ఔట్‌పోస్ట్ పోలీసులు అప్రమత్తమై ఆమెను రక్షించారు. పోలీస్ కానిస్టేబుల్ డి. సారయ్య, హోంగార్డు ఎం.ఎ. హఫీజ్ బేగ్ సమయస్ఫూర్తితో స్పందించి, ఆమెను సముదాయించి ఆత్మహత్యాయత్నం నుంచి విరమింపజేశారు. అనంతరం ఎస్సై రమేష్ ఆమెకు కౌన్సిలింగ్ నిర్వహించి, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.
ఈ సాహసోపేత చర్యకు పోలీసు కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## నూతన ఆలయాలకు పెండ్లిమడుగుల కుటుంబం విరాళం

-మల్లంపేట్ గ్రామంలో సనాతన ధర్మానికి సేవ



**దుండిగల్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దుండిగల్ మున్సిపల్ పరిధిలోని మల్లంపేట్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఎల్లమ్మ తల్లి, పోచమ్మ తల్లి ఆలయాలకు పెండ్లిమడుగుల శ్రీనివాస్ గౌడ్ రూ. 1,00,000 విరాళంగా అందజేశారు. ఆయన శ్రీ అభయాంజనేయ ఆలయ చైర్మన్గా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా సేవలందిస్తున్నారు.
అలాగే రాఘవేందర్ గౌడ్ (మాజీ ఉప సర్పంచ్), అశోక్ గౌడ్ (లీఫ్ చైర్మన్), భార్గవ్ తేజ్ గౌడ్, శ్యామ్ గౌడ్, నరేష్ గౌడ్ కలిసి రూ. 3,00,000 విరాళం అందజేశారు. సనాతన ధర్మం, గ్రామ దేవతల పట్ల భక్తి భావంతో ఈ విరాళాలు అందించారని వారు తెలిపారు.

## వెలుగు హాస్టల్‌లో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ



**చిట్యాల, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** చిట్యాల మండలంలోని వెలుగు హాస్టల్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి, వసతి, భోజనం, బోధన ప్రమాణాలు గురించి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. విద్యా వ్యవస్థను బలపర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోంది అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి అని సూచించారు.

## పీఆర్సీ అమలు చేయాలి

-తపస్ డిమాండ్




**మాడ్గుల, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నూతన పీఆర్సీ ని వెంటనే అమలు చేయాలని తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాడ్గుల మండలంలో తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం సందర్భంగా మాట్లాడుతూ కేజీబీవీ టీచర్లు, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు కనీస వేతన స్కేలు వర్తింపజేయాలని, సమ్మె కాలపు వేతనాలు, పెండింగ్ బిల్లులు, డీఏలు చెల్లించాలని కోరారు. ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కూడా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ నేతలు చీర వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, పున్న రమేష్, విజేందర్ గుప్త, రవీందర్ రెడ్డి, కవిత, చంద్రకళ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేశవపట్నం పోలీస్ స్టేషన్ నూతన భవనంలోకి మార్పు

కమీషనర్ గౌష్ ఆలం చేత ప్రారంభం




**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేశవపట్నం పోలీస్ స్టేషన్ను నూతన అద్దె భవనంలోకి సోమవారం మార్చినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై కొత్త భవనాన్ని ప్రారంభించారు. పోలీస్ స్టేషన్‌కు శాశ్వత భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజలకు సేవలు అందుబాటులో ఉంటాయని కమిషనర్ పేర్కొన్నారు. హుజురాబాద్ ఏసీపీ మాధవి, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, వెంకట్, నిరంజన్, ఎస్సైలు శేఖర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు



**హుస్నాబాద్, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి ప్రారంభించారు. లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బొల్లిశెట్టి శివయ్య, ఎగ్గిడి ఐలయ్య, జంగపల్లి ఐలయ్య, చిత్తారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# వాసవీ వనితా క్లబ్ సేవా కార్యక్రమం

**–మానసిక వికలాంగులకు కిట్, చిన్నారులకు బిస్కెట్లు పంపిణీ**



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గణేష్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ సేవా కార్యక్రమం నిర్వహించారు. మానసిక వికలాంగుల కిట్‌ను ఉపాధ్యాయురాలు పద్మకు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు జిల్లా రజిత, వాసవీ కాపుల్స్ క్లబ్ అధ్యక్షుడు జిల్లా జగదీష్ పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చిన్నారులకు బిస్కెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంపై తల్లిదండ్రులు ప్రశంసలు వ్యక్తం చేశారు.

# వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు

**స్నేహ బంధానికి అర్థవంతమైన వేడుక**



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గణేష్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు జిల్లా రజిత నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు పరస్పర స్నేహ బంధాన్ని ఘనంగా జరుపుకున్నారు. క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, చిన్నారులకు బిస్కెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. సామాజిక సేవలో వాసవీ క్లబ్ పాత్ర ప్రశంసనీయమని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు.

# యుపిఎస్ కన్నారం పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

**వసతులు, మధ్యాహ్న భోజనంపై సమీక్ష**



**హుస్నాబాద్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అక్కన్నపేట మండలంలోని యుపిఎస్ కన్నారం పాఠశాలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వసతులు, మధ్యాహ్న భోజన మెనూ, విద్యార్థుల భోజన నాణ్యత తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. హెచ్‌ఎం జి. రాజ్యలక్ష్మి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిత్తారి రవీందర్, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల కబ్జా పై చర్యలు తీసుకోవాలి

**ప్రజావాణిలో భూముల పరిరక్షణ సమితి వినతి**



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యాచారం మండలంలోని మాల్ గ్రామపంచాయతీ పరిధిలో సర్వే నెంబర్లు 567, 531లో ప్రభుత్వ భూములను కొంతమంది అక్రమంగా కబ్జా చేశారని భూముల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోడుకొండ్ల ప్రవీణ్ ఆరోపించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేసిన ఆయన, ఇంటి నెంబర్లు సృష్టించి, డాక్యుమెంట్లు తయారు చేసి, రిజిస్ట్రేషన్లు జరిపి లావాదేవీలు కొనసాగిస్తున్నారని తెలిపారు. గతంలో ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంతో, డిఐఈఓకు తక్షణ చర్యలు తీసుకునేలా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

# స్వచ్ఛత హరిత పాఠశాల ర్యాంకింగ్‌కు యూనిసెఫ్ సహకారం అవసరం

**పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమంపై దృష్టి: కలెక్టర్ పమేలా**



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో స్వచ్ఛత హరిత పాఠశాలల ర్యాంకింగ్ మెరుగుపరచేందుకు, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి యూనిసెఫ్ సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. సోమవారం యూనిసెఫ్ బృందంతో సమావేశం నిర్వహించిన ఆమె, విద్య, వైద్యం, అంగన్వాడి శాఖల సేవా కార్యక్రమాలకు కూడా యూనిసెఫ్ తోడ్పాటు ఉంటుందని తెలిపారు. భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ వర్క్‌షాప్‌లో కరీంనగర్ జిల్లాలో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాల వివరాలు తెలియజేసినందుకు కలెక్టర్‌ను యూనిసెఫ్ బృందం సన్మానించింది. సమావేశంలో వాష్ స్పెషలిస్ట్ వెంకటేష్, ఫణీంద్ర, కిషన్ స్వామి, రమేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి సేవలపై సమీక్ష

**– జిల్లాలో పర్యటించిన ఆరోగ్య సంచాలకుడు**

**–సాధారణ ప్రసవాల ప్రోత్సహంపై దృష్టి**



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాల తీరును ప్రత్యక్షంగా తెలుసుకోవడమే లక్ష్యంగా ఆరోగ్య సంచాలకుడు డాక్టర్ రవీందర్ నాయక్ జిల్లాల్లో పర్యటన చేపట్టారు. సోమవారం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని సందర్శించిన ఆయన, వసతులు, మందుల లభ్యత, రోగులకు అందుతున్న సేవలు పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై సంసిద్ధత, ల్యాబ్ సేవల నాణ్యత, సీజేరియన్ ప్రసవాల తగ్గింపు, సాధారణ ప్రసవాల ప్రోత్సాహం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. స్త్రీ, పురుష వార్డుల్లో పేషెంట్లతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. నర్సింగ్ సిబ్బంది పనితీరు, ఉచిత పోషకాహారం వంటి అంశాలపై సమీక్షించారు. ఆసుపత్రిలో సమస్యలు ఉంటే ప్రాముఖ్యత ఆధారంగా పరిష్కరించాలని, ప్రతి ఆరోగ్య కేంద్రంతో సమన్వయం కలిగి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ వీరారెడ్డి, డాక్టర్ నవీన్, డాక్టర్ రాజగోపాల్ రావు, డాక్టర్ సనజవేరియా, ఎన్‌హెచ్‌ఎం స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా పనిచేయాలి

**అధికారులను కోరిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్**



**కమాన్‌పూర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ఆ ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్ సూచించారు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఇటీవల నియమితులైన అన్వర్ సోమవారం మండలంలోని వివిధ శాఖల అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సై, ఇన్‌చార్జి ఎంపీఓ, ఈజీఎస్ ఏపీవో, ప్రభుత్వ వైద్యురాలు తదితర అధికారులతో సమావేశమై, ప్రజా సమస్యలపై తక్షణ స్పందనతో పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఏఎంసీ డైరెక్టర్లు దాసరి గట్టయ్య, అబ్దుల్ రఫీక్, కాంగ్రెస్ నాయకులు మల్యాల తిరుపతి, ఎండి ముస్తాక్, పిల్లి శేఖర్, కిషన్ రెడ్డి, నవునూరి నర్సాగౌడ్, అనవేన లక్ష్మీరాజ్యం, గుంజపడుగు రవి, ఇరుగురాల సంతోష్, బోనాల సత్యం, షౌకత్ ఖాన్, సాట్ల గట్టయ్య, మల్యాల మహేష్, పంజా సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ అంతరాయం

**నగరం. ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నగరం సబ్ స్టేషన్ లో 11 కెవి పరిధిలోని 11కెవి ఆల్లపర్రు ఫెడీర్ మరమ్మతు నిమిత్తం నేడు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నగరం మండల పరిధిలోని ఆక్వా కల్చర్ మరియు పాన్ కల్చర్ కు విద్యుత్ సరఫరా ఎపివేయబడుతుందని. కాబట్టి వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని నగరం అసిస్టెంట్ ఇంజనీర్ నాగూర్ మీరా ప్రకటనతో తెలిపారు.

# శాంతినగర్‌లో సీసీ రోడ్ పనులకు శంకుస్థాపన

**ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు అభివృద్ధి పనులు ప్రారంభం**



**రామగుండం, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్థానిక 39వ డివిజన్ శాంతినగర్‌లో 6 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ పనులను సోమవారం ప్రారంభించారు. ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఈ పనులకు మాజీ కార్పొరేటర్ మహంకాళి స్వామి, భేంద్రం రాజిరెడ్డి శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా తక్షణ స్పందనతో కార్యక్రమాలు చేపడుతున్నామని నేతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీనివాసుల ములాఖాత్

**– స్నేహ బంధానికి అర్థవంతమైన వేడుక**



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిరి టిఫిన్ సెంటర్‌లో ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా శ్రీనివాస మిత్రులు ములాఖాత్ నిర్వహించారు. "పేగు బంధం కాదిది, పేరు బంధం" నినాదంతో ఏర్పాటైన శ్రీనివాసుల గ్రూప్ ద్వారా స్నేహ బంధాన్ని మరింత బలపరిచేలా అక్టోబర్ 26న రెండవ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం, ప్రముఖుల సన్మానం వంటి సేవా కార్యక్రమాలపై చర్చించారు. తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలకు ముందుకు వస్తున్న మిత్రులకు వ్యవస్థాపక చైర్మన్ వూట్కూరి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దూస, ఇజ్జగిరి, పెద్ది, చొక్కారపు, నార్ల, మ్యాన, సామ, పడమటింటి, గట్టు, పల్లేర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

# అయ్యప్ప ఆలయంలో కళ్యాణ మండపం ప్రారంభం

**పేదలకు ఉపయోగపడే విధంగా నిర్మాణం: మంత్రి పొన్నం**



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నగరంలోని భగత్ నగర్ శ్రీ హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి ఆలయంలో రూ. 19 లక్షల వ్యయంతో నిర్మించిన శ్రీ సీతారామ కళ్యాణ మండపాన్ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ప్రారంభించారు. పేదలకు స్వల్ప రుసుముతో వినియోగించుకునేలా ఈ మండపాన్ని నిర్మించారని మంత్రి ప్రశంసించారు. ఆలయ చైర్మన్ యాగండ్ల అనిల్ కుమార్, ఈఓ కాంతా రెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులను అభినందించిన మంత్రి, భక్తులకు అయ్యప్ప స్వామి దీవెనలు ఉండాలని ఆకాంక్షించారు. 35 లక్షల రూపాయలతో ఆలయ పునర్నిర్మాణం కొనసాగుతోందని, ఈ నెల 14న ఆంజనేయ స్వామి, శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో పొన్నం రవిచంద్ర, వెలిచాల రాజేందర్ రావు, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, బోనాల శ్రీనివాస్, తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.6 లక్షలతో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**రామగుండం, ఆగస్టు 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):** 5వ డివిజన్‌లో రూ. 6 లక్షల వ్యయంతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన జరిగింది. శాసనసభ్యులు ఎం. ఎస్. రాజ్ ఠాకూర్ సూచన మేరకు ఈ పనులు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ మహంకాళి స్వామి పాల్గొని శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని, ప్రజావసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్, లింగస్వామి, ముస్తఫా, కాంగ్రెస్ నాయకులు, యువజన, మహిళా ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి

"పర్యావరణ పరిరక్షణ సమితి చెట్టు – అమ్మ"
పర్యావరణ హిత ఉద్యమానికి నాయకుల మద్దతు







**హైదరాబాద్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పర్యావరణ పరిరక్షణ సమితి చెట్టు – అమ్మ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పర్యావరణ హిత ఉద్యమంకి ప్రజాప్రతినిధుల నుంచి విశేష మద్దతు లభిస్తోంది. ఈ ఉద్యమంలో భాగంగా సంస్థ అధ్యక్షులు నరేష్ దండు ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పందుల వెంకటేశ్ గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు రవీందర్ రెడ్డి తమ అనుచరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "పర్యావరణ పరిరక్షణ ఒక్క వ్యక్తికి చెందిన బాధ్యత కాదనీ, ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి ప్రకృతిని రక్షించేందుకు చొరవ చూపాలని" పిలుపునిచ్చారు. "సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయం. త్వరలో ఈ ఉద్యమాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి మరిన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయిస్తాము" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సలహా మండలి సభ్యులు పల్లె నర్సింహ మాట్లాడుతూ

"పచ్చదనం పెంపుదల, పరిశుభ్రతపై అవగాహన, డ్రగ్స్ నివారణ వంటి కీలక అంశాల్లో 'పర్యావరణ పరిరక్షణ సమితి' చేస్తున్న కృషి అభినందనీయం. కళారంగానికి చెందిన మేమూ ఈ ఉద్యమానికి మద్దతుగా నిలుస్తాము. భవిష్యత్ తరం కోసం ప్రకృతి పరిరక్షణ చాలా కీలకం" అని వివరించారు. ప్రకృతిని అమ్మలాగా ఆరాధించాలన్న దృక్పథంతో "చెట్టు = అమ్మ" సంస్థ ప్రారంభించిన ఈ ఉద్యమం, ప్రస్తుతం గ్రామాలు, పట్టణాల్లో చైతన్యాన్ని రేకెత్తిస్తోంది. పచ్చదనంపై ప్రేమ, భూమిపై బాధ్యత అనే స్పష్టమైన సందేశంతో సంస్థ చేస్తున్న ప్రయత్నాలను పలు వర్గాలు స్వాగతిస్తున్నాయి.

# బీసీల చైతన్యం కోసం ఎంఏఎస్ఎస్ ఉద్యమం



**యాచారం, ఆగస్టు 4:** గ్రామాల్లో బీసీలను చైతన్యం చేయడమే లక్ష్యంగా మన ఆలోచన సాధన సమితి పనిచేస్తుందని రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొంపోజు నరహరి చారి తెలిపారు. తక్కలపల్లి గ్రామంలో ఎంఏఎస్ఎస్ జెండా ఆవిష్కరించిన ఆయన, బీసీలకు రాజ్యాధికారం రావాలంటే వారి జెండా ఎగురవేయాల్సిందేనన్నారు. రాజకీయ పార్టీలన్నీ బీసీలను ఉపయోగించుకుంటున్నాయని, కానీ ఎదగనివ్వకుండా కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో బీసీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ఎంఏఎస్ఎస్ ఉద్యమం కొనసాగుతుందని చెప్పారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని, బీసీలు ఐక్యంగా రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఎంఏఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# హెచ్ఎం రవీందర్ ఆధ్వర్యంలో పద్మకి ఘన వీడ్కోలు

–వెల్దండలో ఆకృతి గార్డెన్ వేదికగా రిటైర్మెంట్ ఫంక్షన్



**వెల్దండ, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘకాలంగా సేవలందించిన సోషల్ స్టడీస్ ఉపాధ్యాయురాలు అర్ధం పద్మకి సోమవారం పదవీ విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఆకృతి గార్డెన్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తోటి స్నేహితులు, బంధుమిత్రులు పాల్గొని మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. 1985లో డీఎస్సీ ద్వారా ఎస్ఏ (సోషల్ స్టడీస్) ఉపాధ్యాయురాలిగా ఎంపికైన పద్మ గారు మాడుగుల మండలంలోని సింగంపల్లి పాఠశాలలో మొదటి బాధ్యతలు చేపట్టారు. నిష్ఠతో, కృషితో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ పలు పాఠశాలల్లో సేవలందించారు. చివరికి వెల్దండ జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల హెచ్ఎం రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రవీందర్, ఉపాధ్యాయులు రవికిరణ్, అమర్ సింగ్, చంద్రశేఖర్, పత్యా తదితరులు పాల్గొన్నారు. పద్మకి పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ఆహారం కోసం వెళ్తే కంట్లో కాల్చారు!

–గాజాలో ఇజ్రాయిల్ దళాల ఘాతుకాలు
–తాజా దాడుల్లో 57మంది మృతి



**గాజా –ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆకలితో విలవిలలాడుతూ ఆహార కేంద్రాలకు చేరుకుంటున్న అభాగ్యులపై ఇజ్రాయిల్ సేనలు అమానుషంగా వ్యవహరిస్తున్నాయి. గాజాలో అమెరికా, ఇజ్రాయిల్ మద్దతుతో నడుస్తున్న జిహెచ్ఎఫ్ కేంద్రాల వద్ద పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ఏ మూల నుంచి కాల్పులు జరుగుతాయో తెలీక అన్నార్తులు భయం గుప్పిట్లో ప్రాణాలు అరచేత పట్టుకొని వేచి చూస్తున్నారు. తాజాగా ఓ పాలస్తీనా యువకుడు తన కుటుంబ ఆహార అవసరాల కోసం సహాయ కేంద్రం వద్ద వేచి ఉండగా ఇజ్రాయిల్ సైనికులు అతని తలపై గురి పెట్టి కాల్పులు జరపడంతో ఎడమ కన్ను కోల్పోయాడు. తన శరీరంలోకి అప్పటికే బుల్లెట్ దిగిందని, అయినా ఇజ్రాయిల్ సైనికులు తనపై కాల్పులు కొనసాగించారని 14 సంవత్సరాల అబ్దుల్ రహమాన్ అబూ జబార్ చెప్పాడు. కాల్పులకు భయపడిపోయానని, చావు తప్పదని అనుకున్నాననితెలిపాడు. ఆస్పత్రి పడకపై కంటి మీద బ్యాండేజ్ కట్టుతో కన్పించిన జబార్ ఆ సంఘటనను తలచుకొని వణికిపోయాడు. 'ఆహార పంపిణీ కేంద్రానికి వెళ్లడం అదే మొదటిసారి. కుటుంబ సభ్యులకు, నాకు తినడానికి ఏమీ లేకపోవడంతో అక్కడికి వెళ్లాను. జనంతో కలిసి ముందుకు నడిచాను. ఐదు గంటల తర్వాత పంపిణీ కేంద్రం వద్దకు చేరుకున్నా. ఇజ్రాయిల్ సైనికులు కాల్పులు మొదలు పెట్టడంతో మేమంతా పరుగులు తీశాం. అప్పుడు కూడా వారు కాల్పులు ఆపలేదు. ఆ కాల్పుల హోరులో నా శరీరంలో ఏదో విద్యుత్ ప్రసరించినట్టు ఫీలై కింద పడిపోయా. ఎక్కడున్నానో తెలియలేదు. చివరికి ఎలాగో లేచాను. నా తలపై కాల్పులు జరిగాయని ఓ వ్యక్తి చెప్పాడు' అని వివరించాడు.

ఆస్పత్రిలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. విద్యుత్ లేకపోవడంతో వైద్యుడు ఫోన్ లైట్‌తోనే జబార్‌ను పరీక్షించారు. ఏమైనా కన్పిస్తోందా అని ఆయన అడిగారు. జబార్ ఏమీ చూడలేకపోయాడు. కాల్పుల కారణంగా జరిగిన గాయంతో జబార్ కన్ను దెబ్బతిన్నదని వైద్యుడు నిర్ధారించారు. అతనికి శస్త్రచికిత్స చేశారు కానీ చూపు వస్తుందా లేదా అన్నది తెలియడం లేదు.

**ఒక్కరోజే మార్చురీకి 119 మృతదేహాలు**

ఇజ్రాయిల్ దళాల దాడితో దెబ్బతిన్న భవనాలు, ఇతర ప్రదేశాల శిథిలాల నుంచి వెలికితీసిన మృతదేహాలు ఆస్పత్రులకు చేరుకుంటున్నాయి. ఒక్క ఆదివారం నాడే 119 మృతదేహాలను తీసుకొచ్చారు. గాయాలపాలైన 866 మందికి చికిత్స జరుగుతోంది. ఆదివారం ఇజ్రాయిల్ దళాలు జరిపిన కాల్పులలో 92 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో సహాయ కేంద్రాల వద్ద చనిపోయిన వారే 56 మంది ఉన్నారు.

# కరీంనగర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంప్ కార్యాలయం ప్రారంభం

ప్రజా సమస్యల పరిష్కార వేదికగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి



**కరీంనగర్, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం కరీంనగర్ మంకమ్మ తోటలో నూతన మినిస్టర్ క్యాంప్ కార్యాలయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. ఈ కార్యాలయం ద్వారా లోక్‌సభ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారం, సీఎం సహాయనిధి దరఖాస్తులు, సంక్షేమ పథకాల సమాచారం అందుబాటులో ఉంటుందని మంత్రి తెలిపారు. గత కార్యాలయం ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడంతో, ఈ కొత్త కార్యాలయాన్ని ప్రజల కోసం అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెలిచాల రాజేందర్ రావు, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఆకారపు భాస్కర్ రెడ్డి, గడ్డం విలాస్ రెడ్డి, బోనాల శ్రీనివాస్, తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బెంగాలీ విదేశీ భాషనా?

–హోం శాఖ క్షమాపణలు చెప్పాలని సిపిఎం డిమాండ్
–జాతీయ గీతాన్ని రచించిన భాషను అవమానించడమే : స్టాలిన్
–నిరసనలకు మమత పిలుపు



**చెన్నై, కొల్‌కతా ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బెంగాలీ భాషను 'బంగ్లాదేశీ భాష'గా తప్పుగా పేర్కొంటూ ఢిల్లీ పోలీసులు లేఖను జారీ చేయడాన్ని పలు పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఆ లేఖ ఢిల్లీ పోలీసుల ఆందోళనకరమైన వైఖరిని ప్రతిబింబిస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. అక్రమ బంగ్లాదేశీ ఇమ్మిగ్రెంట్లుగా అనుమానిస్తూ బెంగాలీ మాట్లాడే వ్యక్తులు అనేకమందిని వారు అరెస్టు చేస్తున్నారని, ప్రత్యేకమైన శైలితో బెంగాలీ భాష ఒక్కటే వుందనే వాస్తవాన్ని పూర్తిగా విస్మరించారని దీన్ని బట్టి తెలుస్తోందని పొలిట్‌బ్యూరో తెలిపింది. 'భారతదేశంలోని జాతీయ భాషల్లో బెంగాలీ ఒకటి. దీన్ని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో గుర్తించారు. అటువంటి ఈ భాషను విదేశీ భాషగా ముద్ర వేస్తూ కేంద్ర హోం శాఖ పరిధిలో పనిచేసే ఢిల్లీ పోలీసులే రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తు న్నారు. బెంగాలీ భాష మాట్లాడే వ్యక్తుల పట్ల పదే పదే తన వ్యతిరేకతను చూపించే అమిత్ షా నేతృత్వంలోని హోం మంత్రిత్వ శాఖ వైఖరి ఏమిటనేది దీంతో తెలుస్తోంది. పొరుగునున్న దేశంతో భాషను పంచుకుంటున్నారనే కారణంతో బెంగాలీలను చొరబాటుదారులుగా చూపించేందుకు బిజెపి ప్రభుత్వం పాల్పడుతున్న నీచమైన ఎత్తుగడను ఈ మొత్తం ప్రహసనం వెల్లడిస్తోంది. వివిధ రాష్ట్రాల్లో, పోలీసులు బెంగాలీలను ముఖ్యంగా నిరుపేదలైన వలస కార్మికులను వేధిస్తున్నారు. వారిని అక్రమంగా నిర్బంధిస్తున్నారు. చాలామందిని వేధింపులకు గురి చేస్తూ, వారి పట్ల అసభ్యంగా వ్యవహరిస్తూ, కనీసం న్యాయబద్ధమైన ప్రక్రియను కూడా అనుసరించకుండానే వారిని తరలించేస్తున్నారు. బెంగాలీ మాట్లాడే పౌరులను వేధించడానికి కేంద్రప్రభుత్వం తక్షణమే స్వస్తి పలకాలని' సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. బెంగాలీని విదేశీ బాషగా గుర్తించినందుకు హోం మంత్రిత్వ శాఖ క్షమాపణలు చెప్పాలని, అందుకు బాధ్యులైన అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరింది.

# నరసరావుపేటలో రైతు శాస్త్రవేత్తలకు శిక్షణ కార్యక్రమలు

**నరసరావుపేట ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నరసరావుపేట పట్టణం లోని బృందావన్ ట్రైనింగ్ హాల్‌లో రైతు శాస్త్రవేత్తల కోర్సు ఐదవ, మూడవ సెమిస్టర్ విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె. అమలకుమారి ప్రకృతి వ్యవసాయ విభాగంలో ఏ గ్రేడ్ మోడల్, ఎటిఎం మోడల్స్ గురించి రైతు శాస్త్రవేత్తలకు వివరించారు. ఈ మోడల్స్ పాటించడం ద్వారా నేల, పర్యావరణం, మానవుల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టి.పి.పి. స్రవంతి, డి.పి.పి. భవాని రాజు, శ్రీనివాస్, విజయలక్ష్మి, మెంటర్స్, అధికారులుతదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## చాలాకాలం తర్వాత స్వల్పంగా బలపడ్డ రూపాయి

అమెరికన్ డాలర్ తో పోల్చితే రూపాయి మారకం విలువ సోమవారం స్వల్పంగా బలపడింది. కొంతకాలంగా క్షీణిస్తూ వస్తున్న రూపాయికి ఇది కాస్త ఊరటగా చెప్పవచ్చు. ఇవాళ ఫారెక్స్ మార్కెట్ లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 87.36 రూపాయల వద్ద స్థిరపడింది. దాంతో ఈ ఏడాదిలో నమోదైన గరిష్ఠ పతనం నుంచి రూపాయి కాస్త కోలుకున్నట్లయ్యింది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఆ సమయంలో ఒక డాలర్‌కు రూ.88.10 వరకు చెల్లించాల్సి వచ్చింది. దాంతో పోలిస్తే ఇవాళ్టి 87.36 రూపాయలు కొంత సానుకూలమని చెప్పవచ్చు. అయితే ఈ మధ్యకాలంలో రూపాయి తీవ్ర ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. గడిచిన ఏడాది కాలంలో రూపాయి విలువ 4.06 శాతం బలహీనపడగా.. గత నెల రోజుల్లోనే 1.77 శాతం పతనమైంది. ఈ ఏడాది జనవరి నుంచి చూసినప్పుడు డాలర్‌పై రూపాయి విలువ సుమారు 1.82 శాతం మేర నష్టపోయింది.



దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన గణాంకాలు, రిజర్వ్ బ్యాంక్ చర్యలు, లేదా ప్రపంచ మార్కెట్లలోని సానుకూల సెంటిమెంట్ లాంటి కారణాలవల్ల రూపాయికి డిమాండ్ పెరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. అయితే ఈ పురోగతి తాత్కాలికమే కావచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ త్రైమాసికం చివరి నాటికి డాలర్‌తో రూపాయి మారకం విలువ తిరిగి 87.52 రూపాయలకు చేరే అవకాశం ఉంది. రాబోయే 12 నెలల్లో కూడా రూపాయి మారకం విలువ స్వల్పంగా క్షీణించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆర్థిక వ్యవస్థలో స్థిరమైన మెరుగుదల ఉంటేనే రూపాయి విలువ దీర్ఘకాలంలో నిలదొక్కుకుంటుందని నిపుణులు చెబుతున్నారు.

## షాక్ ఇచ్చిన బంగారం, వెండి..!

### హైదరాబాద్‌లో తులం ఎంత ఉందంటే..?



బంగారం ధరలు కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. సోమవారం ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ రూ.400 పెరిగి రూ.98,020 చేరుకుంది. ఇక 22 క్యారెట్ల పసిడి రూ.300 పెరిగి రూ.97,800కి చేరుకుంది. అదే సమయంలో వెండి రూ.500 పెరిగి కిలోకు రూ.1.10లక్షలకు పెరిగిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. రూపాయి బలహీనంగా మారడం, యూఎస్ స్థూల ఆర్థిక డేటా విడుదల నేపథ్యంలో బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయని.. ఈ డేటా అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరకు మద్దతు ఇవ్వడంతో ఔన్సుకు 3,355 డాలర్లకు చేరుకుంది. టారిఫ్ ఆందోళనలు, రూపాయి విలువ తగ్గడంతో ర్యాలీకి కారణమని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ (కమోడిటీ అండ్ కరెన్సీ) వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది పేర్కొన్నారు. రాబోయే వారంలో పెట్టుబడిదారులు రాబోయే ఆర్‌బీఐ RBI ద్రవ్య విధాన సమావేశం, యూఎస్ తయారీ డేటాపై దృష్టి సారిస్తారని పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులో బులియన్ ధరల దిశపై మరింత మార్గదర్శనం చేస్తాయని పేర్కొన్నారు. మరో వైపు న్యూయార్క్‌లో బంగారం స్పాట్ ఔన్సుకు 3,363.83 వద్ద స్థిరంగా ఉన్నది. విదేశీ మార్కెట్లలో వెండి స్పాట్ ఔన్సుకు 37.20కి చేరుకుంది. మిరే అసెట్ షేర్ ఖాన్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ (ఫండమెంటల్ కరెన్సీస్అండ్ కమోడిటీస్) ప్రవీణ్ సింగ్ మాట్లాడుతూ.. గోల్డ్ స్పాట్ ఔన్సుకు 3,355 వద్ద ట్రేడవుతోందన్నారు. వడ్డీ రేటు కోతలను ఊహించి రిస్క్ ఆస్తులను వేలం వేస్తున్నారని.. సుంకాల ఆందోళనల కారణంగా భారత రూపాయిలో పతనం దేశీయ బంగారం ధరలకు మద్దతు ఇస్తోందని తెలిపారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికి వస్తే.. 22 క్యారెట్ల గోల్డ్ రూ.92,950 ఉండగా.. 24 క్యారెట్ల పసిడి రూ.1,01,400 పలుకుతున్నది. ఇక వెండి కిలోకు రూ.1.23లక్షలు పలుకుతున్నది.

## అత్యంత చౌకైన ఈ కారు ధర రూ. 4.23 లక్షలు.. 6 ఎయిర్ బ్యాగులు!

మారుతి భారత మార్కెట్లో అత్యధికంగా అమ్ముడవుతున్న కంపెనీలలో ఒకటి. ఇప్పుడు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మారుతి తన కార్ల దాదాపు అన్ని వేరియంట్లలో 6 ఎయిర్‌బ్యాగ్‌లను చేర్చింది. ముఖ్యంగా అరీనా డీలర్‌షిప్‌లలో విక్రయించే చౌకైన కార్లలో ఖచ్చితంగా 6 ఎయిర్‌బ్యాగ్‌లు ఉంటాయి. ఈ జాబితాలో మారుతి చౌకైన ఎంట్రీ లెవల్ కారు ఆల్టో K10, సెలెరియో, వ్యాగన్‌ఆర్, స్విఫ్ట్, డిజైర్ వంటి మోడళ్లు ఉన్నాయి.

ఈ కార్లలో కంపెనీ 6 ఎయిర్‌బ్యాగ్‌లను ప్రామాణికంగా మార్చినప్పటి నుండి ఈ కార్లకు డిమాండ్ వేగంగా పెరుగుతోంది. అయితే, ఈ అప్‌డేట్ కారణంగా ఈ కార్ల ధర పెరిగింది. కానీ 6 ఎయిర్‌బ్యాగ్‌లతో వచ్చే దేశంలో అత్యంత చౌకైన కారు



ధర రూ. 4.23 లక్షలు.

**లైనప్ అంతటా 6 ఎయిర్‌బ్యాగులు:**

దీనిపై కంపెనీ ఇటీవల మా మొత్తం లైనప్‌లో దాదాపు 6 ఎయిర్‌బ్యాగ్‌లను ఇన్‌స్టాల్ చేశామని తెలిపింది. దీని కారణంగా ఎంట్రీ-లెవల్ వేరియంట్‌లపై ప్రజల విశ్వాసం కూడా పెరిగింది. వ్యాగన్‌ఆర్ వంటి మోడళ్ల బుకింగ్‌లలో కంపెనీ అత్యధిక పెరుగుదలను చూస్తోంది. దీనితో పాటు సెలెరియో, వ్యాగన్‌ఆర్, స్విఫ్ట్ వంటి మోడళ్ల బుకింగ్‌లు జూలైలో 7 శాతం పెరిగాయి.

**ప్రీమియం వాహనాల అమ్మకాలలో తగ్గుదల:**

అదే సమయంలో మారుతి బ్రెజ్జా, ఫ్రాంక్స్, జిమ్నీ, గ్రాండ్ విటారా వంటి స్వల్ప ప్రీమియం కార్లు కూడా 6.3 శాతం క్షీణతను నమోదు చేశాయి. ఈ విభాగంలో కంపెనీ మొత్తం 52,773 యూనిట్లను విక్రయించింది. కానీ ఈసారి ఎంట్రీ లెవల్ కార్లు పెద్ద దెబ్బ తిన్నాయి. ఆల్టో, ఎస్-ప్రెసో వంటి కార్ల అమ్మకాలు 31.5 శాతం తగ్గాయి. 6,822 యూనిట్లు మాత్రమే అమ్ముడయ్యాయి.

## ఓవల్ హీరో సిరాజ్.. అయిదో టెస్టులో గిల్ సేన విక్టరీ.. 2-2తో సిరీస్ సమం

**ఓవల్**

తీవ్ర ఉత్కంఠ రేపిన ఓవల్ టెస్టులో గిల్ సేన.. ఆరు పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. హైదరాబాదీ స్టార్ బౌలర్ సిరాజ్ .. ఆఖరి రోజు నిప్పులు చెరిగాడు. అయిదో టెస్టులో విజయం సాధించడంతో.. సిరీస్ 2-2 తేడాతో సమమైంది. రెండో ఇన్నింగ్స్‌లో సిరాజ్ అయిదు వికెట్లు తీసి ఇండియన్ విక్టరీలో కీలక పాత్ర పోషించాడు. చివరి రోజు కేవలం 34 రన్స్ టార్గెట్‌తో ఇంగ్లండ్ బరిలోకి దిగింది. ఇండియా గెలవాలంటే మరో నాలుగు వికెట్లు తీయాల్సి ఉంది. అయితే ప్రతి బంతి తీవ్ర టెన్షన్‌గా సాగింది. సిరాజ్ తన స్పీడ్‌తో ఇంగ్లండ్ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. చివరి రోజు జేమీ స్మిత్, ఓవర్టన్, అట్కిన్సన్ వికెట్లను సిరాజ్ తీశాడు. అయిదో రోజు తొలి సెషన్‌లో 28 పరుగులు మాత్రమే చేసి నాలుగు వికెట్లను ఇంగ్లండ్ కోల్పోయింది. గిల్ కెప్టెన్సీలో తొలి సిరీస్ డ్రా అయ్యింది. ఈ సిరీస్‌లో శుభమన్ తన ట్యాలెంట్ చూపించాడు. బ్యాట్‌తో 700 పైగా రన్స్ చేశాడు. ఓవల్ టెస్టు చివరి రోజు కూడా



ప్రతి వికెట్ కోసం బౌలర్లతో గిల్ చర్చించిన తీరు అతని సారథ్యాన్ని నిరూపించింది. గాయపడ్డ క్రిస్ వోక్స్ ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్ చేశాడు. చివరి వికెట్ రూపంలో అతను మైదానంలోకి వచ్చాడు. ఎడమ భుజానికి గాయమైనా.. ఇంగ్లండ్‌ను గెలిపించేందుకు ట్రై చేశాడు. అయితే అతను ఒక్క బంతిని కూడా ఎదుర్కోలేదు.

**స్కోరు బోర్డు**

ఇండియా 224 & 396

ఇంగ్లండ్ 247 & 367

## లక్కీ జాకెట్' వేసుకున్నా.. టీమిండియా గెలిచింది

ఓవల్ టెస్టులో భారత జట్టు చరిత్రాత్మక విజయంతో సిరీస్ కాపాడుకుంది. ఐదో రోజు సిరాజ్ మూడు వికెట్లతో టీమిండియాకు సూపర్ విక్టరీ అందించిన క్షణం మైదానంలోని ప్రేక్షకులే కాదు.. భారత అభిమానులు సంబురాల్లో మునిగిపోయారు. కామెంటరీ బాక్స్‌లో ఉన్న సునీల్ గవాస్కర్ అయితే గట్టిగా అరుస్తూ విజయాన్ని ఎంజాయ్ చేశాడు. చివరి బ్యాటర్ అట్కిన్సన్‌ను సిరాజ్ బౌల్డ్ చేయగానే సహచరులు హర్ష భోగ్లే, ఛతేశ్వర్ పూజారాలతో కలిసి చిరస్మరణీయ విజయాన్ని తనివితీరా ఆస్వాదించాడీ లెజెండ్. అయితే.. ఈ మ్యాచ్ కోసం తాను లక్కీ జాకెట్ ధరించానని సన్నీ తెలిపాడు. ఇంతకూ ఆ జాకెట్ తనకు లక్కీ ఎలా అయిందో తెలుసా..?'సిరీస్



ఫలితాన్ని నిర్ణయించే మ్యాచ్‌లకు నేను ఈ జాకెట్ ధరిస్తాను. ఆస్ట్రేలియాలో గబ్బా టెస్టులో ఇదే జాకెట్‌తో కామెంటరీ చేశాను. అప్పుడు భారత్ చిరస్మరణీయ విక్టరీ సాధించింది. ఇప్పుడు ఓవల్ టెస్టులో టీమిండియా గెలవాలని మళ్లీ నేను అదృష్టంగా భావించే జాకెట్ వేసుకున్నాను. ఇంకేముంది భారత్ అద్భుత విజయంతో సిరీస్ సమం చేసింది' అని గవాస్కర్ సంతోషంగా వెల్లడించాడు. ఓవల్ టెస్టు మూడోరోజు గవాస్కర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో మాట్లాడుతూ తన లక్కీ జాకెట్ గురించి వివరించాడు. 'రేపు నేను నా లక్కీ జాకెట్ వేసుకొని వస్తాను. ఆ జాకెట్‌ను ఆస్ట్రేలియా పర్యటనలో గబ్బా టెస్టులో వేసుకున్నా. ఈసారి మీ కోసం ఆ జాకెట్‌తో వస్తాను. ఆల్ ది బెస్ట్. ఆ దేవుడి ఆశీస్సులు మీకు ఉంటాయి' అని గిల్‌తో తాను చెప్పినట్టు సన్నీ తెలిపాడు. అయితే.. వర్షం కారణంగా నాలుగో రోజు ముగియాల్సిన మ్యాచ్ ఐదో రోజుకు వాయిదా పడింది. సో.. గవాస్కర్ అదే జాకెట్‌తో సోమవారం కామెంటరీ బాక్స్‌లో అడుగుపెట్టాడు.

# స్పోర్ట్స్

## ఎన్‌సీఏలో సూర్య..

### ఆసియా కప్‌లోపు ఫిట్‌నెస్ సాధించేనా..?



భారత టీ20 సారథి సూర్యకుమార్ యాదవ్ ఆటకు దూరమై రెండు నెలలు కావొస్తోంది. జూన్‌లో 'స్పోర్ట్స్ హెర్నియా' సర్జరీ అనంతరం కోలుకుంటున్న సూర్య ఆసియా కప్ పై దృష్టి సారించాడు. మెగా టోర్నీకి నెలరోజుల సమయం మాత్రమే ఉండడంతో త్వరగా కోలుకునేందుకు సిద్ధమవుతున్నాడు. బెంగళూరులోని ఎన్‌సీఏ లేదా.. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కొన్నిరోజులు రిహాబిలిటేషన్‌లో ఉండనున్నాడు. తాను ఫిట్‌నెస్ సాధించడం కోసం ఎన్‌సీఏలో పునరావాసం కల్పించాలని అతడు ఇప్పటికే భారత క్రికెట్ నియంత్రణ మండలికి తెలియజేశాడు సూర్య. పొట్టి క్రికెట్ సంచనలంగా పేరొందిన సూర్య.. నిరుడు పొట్టి ప్రపంచ కప్ తర్వాత కొత్త సారథిగా బాధ్యతులు చేపట్టాడు. శ్రీలంక పర్యటనలో జట్టును విజయ పథాన నడిపిన ఈ ముంబైకర్.. అనూహ్యంగా గాయపడ్డాడు. దాంతో, స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ అనివార్యం కాగా.. జర్మనీకి వెళ్లాడు. మూడేళ్లలో అతడు ఈ అపరేషన్ చేయించుకోవడం ఇది మూడోసారి. సెప్టెంబర్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా ఆసియా కప్ షురూ కానుంది. ఆలోపే సూర్య కోలుకొని ఫిట్‌నెస్ సాధిస్తాడా? అనేది తెలియాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 9 వ తేదీ నుంచి 28 వరకూ జరిగే ఈ మెగా టోర్నీ జరుగనుంది. భారత జట్టు 15వ తేదీన పాకిస్థాన్‌ను ఢీకొననుంది. 'పొత్తికడుపు కుడివైపు భాగంలో స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ విజయవంతమైంది. ఆపరేషన్ ముగిశాక నేను కోలుకొనే దశలో ఉన్నాననే విషయాన్ని మీతో పంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. మళ్లీ మైదానంలోకి దిగేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నా' అని ఆస్పత్రి బెడ్ మీద విజయం సంకేతం చూపిస్తూ జూన్ 26న సూర్య సోషల్ మీడియా పోస్ట్ పెట్టిన విషయం తెలిసిందే.